



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 285 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 02-02-2026 పేజీలు-8 | వెల: రూ. 5.00

## తెలంగాణ తీరని అన్యాయం

- తెలంగాణ ఏం తప్పు చేసింది..
- జాతీయ ఉపాధి హామీకి బీజేపీ తూట్లు
- ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ సంక్షేమాన్ని పట్టించుకోలేదు
- సీఎం రేవంత్‌తోపాటు మంత్రులు, ఎంపీలు ప్రధానిని కలుద్దాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విజ్ఞప్తి

హైదరాబాద్




కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, పార్లమెంటు సభ్యులు (ఎంపీలు) బృందంగా వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలుద్దామని విజ్ఞప్తి చేశారు.

-మిగతా 2 లో




# రూ.53.5 లక్షల కోట్లతో కేంద్ర బడ్జెట్

**హైదరాబాద్ నుంచి మూడు హైస్పీడ్ రైళ్లు, ఏపీకి రేర్ ఎర్త్ కారిడార్**

### వికసిత బారత్ దిశగా అడుగులు



- కష్టమ్స్' తగ్గింపు.. ఎగుమతులు పెంచే వ్యూహాలు
- ఆత్మనిర్భరత వల్లే 7 శాతం గ్రోత్ రేటు ఆకాంక్ష
- మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల నిర్మాణం
- దేశంలో మరిన్ని మెగా టెక్స్‌టైల్ పార్కులు
- రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్లు.. ఏపీకి ఒకటి
- 2047 వరకూ డేటా సెంటర్లకు ట్యాక్స్ హాలిడే
- మూలధన వ్యయం లక్ష కోట్లు పెంపు
- నిర్మాణ, తయారీ రంగాలకు మరింత ప్రోత్సాహం
- సెమీ కండక్టర్ పరిశ్రమకు 40 వేల కోట్లు
- 2 లక్షల కోట్ల మేర తగ్గిన పన్ను వసూళ్లు
- పలు పథకాలకు కేటాయింపుల్లో కోతలు
- 9వసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మల
- ఎస్టీటీ దెబ్బ.. సెన్సెక్స్ 1,546 పాయింట్లు పతనం

న్యూఢిల్లీ,

జాతీయ, అంతర్జాతీయ సవాళ్లకు దీటుగా బడ్జెట్‌లో 'స్వదేశీ మంత్రం' పఠించారు! సుంకాలకు జంకేది లేదంటూ ఆత్మ నిర్భర అస్త్రానికి పదును పెట్టారు! ట్రంప్ సుంకాలతో దెబ్బతిన్న రంగాలకు 'కస్టమ్స్' తగ్గించారు! నిర్మాణ, తయారీ రంగాలకు మరింత 'బూస్ట్' ఇచ్చారు! గ్లోబల్ మార్కెట్లతో కలిసిమెలిసి సాగాలని.. ఎగుమతులను మరింతగా విస్తరించాలని సంకల్పించారు! జెన్‌జీకి జైకొట్టారు! ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు సంకల్పం చెప్పుకొన్నారు! వ్యక్తిగత ఆదాయ పన్ను విషయంలో మాత్రం ఎటువంటి మార్పులూ చేయలేదు. ఉద్యోగులకు ఎటువంటి ఊరట కల్పించలేదు.

-మిగతా 2 లో






## మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుదల

- 140కోట్ల మంది ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం
- బడ్జెట్ ప్రతిపాదనలపై ప్రధాని మోడీ వ్యాఖ్య




న్యూఢిల్లీ,

:కేంద్ర బడ్జెట్ 2026-27 పై ప్రధాని మోదీ స్పందించారు. ఈ పద్దు 140 కోట్ల మంది ఆకాంక్షలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ఇది సంస్కరణల ప్రయాణాన్ని బలోపేతం చేస్తుందని వ్యాఖ్యానించారు. మూలధన వ్యయానికి, వృద్ధికి మధ్య సమతూకం పాటించారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై ప్రశంసలు కురిపించారు. వికసిత్ భారత్ నిర్మాణానికి మార్గనిర్దేశనర చేస్తుందని, ఇది చరిత్రాత్మక బ్జడెట్ అని కొనియాడారు.

-మిగతా 2 లో

## సంక్షోభాలపై దృష్టి పెట్టని బడ్జెట్

- ఎదురుదెబ్బలు తగులుతున్నా ఎదుర్కొనే మార్గం లేదు
- బడ్జెట్ ప్రతిపాదనలపై రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ,

:కేంద్ర బడ్జెట్ 2026-27 పై ప్రధాని మోదీ స్పందించారు. ఈ పద్దు 140 కోట్ల మంది ఆకాంక్షలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ఇది సంస్కరణల ప్రయాణాన్ని బలోపేతం చేస్తుందని వ్యాఖ్యానించారు. మూలధన వ్యయానికి, వృద్ధికి మధ్య సమతూకం పాటించారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై ప్రశంసలు కురిపించారు. వికసిత్ భారత్ నిర్మాణానికి మార్గనిర్దేశనర చేస్తుందని, ఇది చరిత్రాత్మక బ్జడెట్ అని కొనియాడారు. బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు చేశారు. 2047 మిషన్ లక్ష్యాల అనుగుణంగా ఈ బడ్జెట్ ఉంది. త్వరలో ఇండియా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది' అని చెప్పారు. ప్రభుత్వ సంస్కరణల అజెండాను రీఫామ్ ఎక్స్‌ప్రెస్‌గా పిలిచిన మోదీ ఆ ఎక్స్‌ప్రెస్‌కు బ్జడెట్ కొత్త శక్తిని అందించిందని పేర్కొన్నారు. ఈ సంస్కరణలు యువతకు అద్భుతమైన అవకాశాలు కల్పిస్తాయన్నారు. భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మాత్రమే ఉండిపోవాలని భారతీయులు అనుకోవడం లేదని, సాధ్యమైనంత వేగంగా మూడో అతిపెద్ద ఆర్థిక

-మిగతా 2 లో



## బంగ్లాదేశ్‌కు షాకిచ్చిన కేంద్ర బడ్జెట్.

- హిందువులపై దాడులు..
- ఆర్థిక సాయంలో కోత

న్యూఢిల్లీ,

హిందువులు సహా మైనారిటీలపై దాడుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బంగ్లాదేశ్‌కు ఇండియా షాకిచ్చింది. ఆ దేశానికి ప్రతి ఏటా అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సగానికి తగ్గించింది. ఈ మేరకు ఆదివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2026-27లో బంగ్లాకు అందించబోయే నిధుల్ని సగం తగ్గించింది. బంగ్లా ఆర్థిక పరిస్థితి ధీనంగా ఉండటంతో ఆ దేశానికి భారత్ సాయం చేస్తూ వస్తోంది.ప్రతి ఏటా కోట్ల రూపాయల నిధుల్ని మన బడ్జెట్‌లోనే కేటాయిస్తాం. అయితే, ఈసారి మాత్రం గత ఏడాది ఇచ్చిన నిధుల్లో సగం

-మిగతా 2 లో

## ఎస్ఎల్‌బీసీ తవ్వకాల్లో జాప్యాన్ని సహించం

- కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు డిజైన్లు సిద్ధం చేయాలి
- అధికారులకు నీటిపారుదల మంత్రి ఉత్తమ్ ఆదేశాలు



హైదరాబాద్,

శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం నిర్మాణ పనుల పునరుద్ధరణలో జాప్యాన్ని ఉపేక్షించబోమని నీటిపారుదల మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. రక్షణ నియమావళిని పాటిస్తూ తక్షణమే యంత్రాలు, సిబ్బందిని రంగంలో దింపి రోజుకు 24 గంటల పాటు 3 షిఫ్టుల్లో నిరంతరం పనులు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల పునరుద్ధరణపై ఆదివారం

-మిగతా 2 లో

# సుప్రీం అంటే మీరేనా?

### మీ ఆదేశాలతోనే ఫోన్ ట్యాపింగ్ జరిగిందా?



**నందినగర్‌లోని నివాసంలో కేసీఆర్‌ను నాలుగున్నర గంటలపాటు విచారించిన సిట్**

- ప్రశ్నలు సంధించిన ఆరుగురు అధికారులు
- సిట్ సేకరించిన ఆధారాలతో ప్రశ్నలు.. ఎదురు ప్రశ్నించిన కేసీఆర్
- విచారణ సమయంలో ఇంటిబయట ఉద్రిక్తత, కార్యకర్తల నిరసనలు

హైదరాబాద్

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును సిట్ అధికారులు విచారించారు. ఆదివారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో తన సొంత నివాసంలో ఆయన్ను నాలుగున్నర గంటల పాటు ప్రశ్నించారు. ఈ సమయంలో ఇంటి బయట వేలాది మంది కార్యకర్తల నిరసనలు, నినాదాలు చేశారు. భారీ బందోబస్తు మధ్య ఆరుగురు సిట్ అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. విచారణ పర్వం పూర్తిగా వీడియో రికార్డింగ్ చేశారు. అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు నేరుగా సమాధానమిచ్చిన కేసీఆర్ మరికొన్నింటికి ఎదురు ప్రశ్నించారు.

-మిగతా 2 లో

# హైదరాబాద్ హైస్పీడ్

- రాష్ట్రానికి 33 బాలికల హాస్టళ్లు
- పన్నులు, సుంకాల్లో 0.72% మేర పెరిగిన వాటా
- వాటిద్వారా రాష్ట్రానికి రూ.33,180.78 కోట్ల ఆదాయం
- సెమీ కండక్టర్ల మిషన్, మెడికల్ టూరిజం హబ్ ఊసు లేదు
- రాష్ట్రం విజ్ఞప్తులను పట్టించుకోకపోవడంపై విమర్శలు
- హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, పుణెలకు హైస్పీడ్ రైళ్లు.. 300- 320 కి.మీ. వేగం



న్యూఢిల్లీ,

రవాణారంగాన్ని ఉరకలెత్తించే లక్ష్యంతో దేశంలోని ప్రధాన నగరాలను అనుసంధానిస్తూ కేంద్ర ప్రభుత్వం ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లను ప్రకటించింది. వీటిలో మూడు కారిడార్లు హైదరాబాద్‌తోనే అనుసంధానం కావడం.. దేశ చిత్రపటంలో హైదరాబాద్‌కు ఉన్న ప్రాధాన్యాన్ని స్పష్టం చేసింది! పుణె-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, ముంబై-పుణె, చెన్నై-బెంగళూరు, ఢిల్లీ-వారాణసీ, వారాణసీ-సిలిగురి నడుమ చేపట్టే ఈ రైల్వే కారిడార్లు రైల్వే అనుసంధానాన్ని మరింతగా పెంచనున్నాయి. ఈ కారిడార్లను ఆర్థిక మంత్రి అభివృద్ధి అనుసంధాన కేంద్రాలుగా ప్రకటించారు. వీటివల్ల ఆయా ప్రాంతాల అభివృద్ధి మరింత వేగవంతం కావటంతోపాటు నూతన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా అందుబాటులోకి వస్తాయని అంచనాలున్నాయి. గంటకు 300-320 కి.మీ. వేగంతో నడిచే బుల్లెట్

-మిగతా 2 లో

## మూడో ఆర్థిక వ్యవస్థగా
# భారత్ ఎదుగుదల

మొదటి తరువాయి



బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు చేశారు. 2047 మిషన్ లక్ష్యాల అనుగుణంగా ఈ బడ్జెట్ ఉంది. త్వరలో ఇండియా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది' అని చెప్పారు. ప్రభుత్వ సంస్కరణల అజెండాను రీఫామ్ ఎక్స్‌ప్రెస్‌గా పిలిచిన మోదీ ఆ ఎక్స్‌ప్రెస్‌కు బ్జడెట్ కొత్త శక్తిని అందించిందని పేర్కొన్నారు. ఈ సంస్కరణలు యువతకు అద్భుతమైన అవకాశాలు కల్పిస్తాయన్నారు. భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మాత్రమే ఉండిపోవాలని భారతీయులు అనుకోవడం లేదని, సాధ్యమైనంత వేగంగా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇక ఈ పద్దు మహిళా సాధికారతకు నిదర్శనంగా ఉందని, వరుసగా తొమ్మిదిసార్లు దీనిని లోక్‌సభలో ప్రవేశపెట్టి నిర్మలాసీతారామన్ రికార్డు సృష్టించారని ప్రధాని మోదీ కొనియాడారు.ం

## సంక్షోభాలపై దృష్టి పెట్టని బడ్జెట్

మొదటి తరువాయి

వ్యవస్థగా మారాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇక ఈ పద్దు మహిళా సాధికారతకు నిదర్శనంగా ఉందని, వరుసగా తొమ్మిదిసార్లు దీనిని లోక్‌సభలో ప్రవేశపెట్టి నిర్మలాసీతారామన్ రికార్డు సృష్టించారని ప్రధాని మోదీ కొనియాడారు.

## బంగ్లాదేశ్‌కు షాకిచ్చిన కేంద్ర బడ్జెట్.

మొదటి తరువాయి

మాత్రమే కేటాయిస్తూ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ నిర్ణయం తీసుకున్నారు. గత ఏడాది బంగ్లాకు రూ.120 కోట్ల సాయం అందించగా.. ఈసారి 50 శాతం తగ్గించి రూ.60 కోట్లు మాత్రమే కేటాయించారు. గత ఏడాది చివరి నుంచి బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. హిందువులపై దాడులు చేయడం, వారి ఆస్తుల్ని ధ్వంసం చేయడంతోపాటు కొందరిని హత్య చేశారు. ఈ అంశంలో భారత్ తీవ్రంగా స్పందించింది. ఈ దాడుల్ని ఆపాలని బంగ్లాలోని తాత్కాలిక ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోవడం లేదు. ఇంకా దాడులు జరుగుతూనే ఉన్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య నెమ్మదిగా ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతింటున్నాయి. మరోవైపు వచ్చే వారం మన దేశంలో ప్రారంభం కానున్న టీ20 వరల్డ్ కప్ టోర్నీలో పాల్గొనేందుకు బంగ్లా నిరాకరించింది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌కు షాకిస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బంగ్లాకు అందించే సాయాన్ని తగ్గించింది. మరోవైపు ఇరాన్ పరిధిలోని చాబహార్ పోర్టుకు కూడా ఈసారి కేంద్రం నిధులు కేటాయించలేదు. ఇరాన్ వాణిజ్యానికి, భారత ఎగుమతులకు ఈ పోర్టు కీలకం. ఈ పోర్టు అభివృద్ధిలో భారత్ కీలక భాగస్వామిగా ఉంది. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తూ వస్తోంది. కానీ, ఈసారి మాత్రం నిధులు కేటాయించలేదు. కారణం.. ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు విధించడమే.

## ఎస్ఎల్‌బీసీ తవ్వకాల్లో జాప్యాన్ని సహించం

మొదటి తరువాయి

ఇక్కడ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత గడువులోగా ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రాజెక్టు పనుల నిర్వహణకు చీఫ్ ఇంజనీర్(సీఈ)ను నియమించి అతడి పర్యవేక్షణ కింద ఎస్ఎల్‌బీసీ డివిజన్ పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. పనుల పర్యవేక్షణకు స్వతంత్ర కన్సల్టెంట్‌ను నియమించాలని కోరారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ డిజైన్ల తయారీని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 16 తర్వాత ఎన్‌డీఎ?సఏ నిపుణుల కమిటీతో సమావేశం నిర్వహించనున్నామని, ఇందుకోసం పునరుద్ధరణ ప్రణాళికతో ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు ం

## హైదరాబాద్ హైస్పీడ్

మొదటి తరువాయి

ట్రెయిన్స్‌తో ప్రయాణ సమయం గణనీయంగా తగ్గిపోతుంది. వ్యాపార తదితర అవసరాల కోసం హైదరాబాద్ నుంచి బెంగళూరుగానీ చెన్నైగానీ ప్రయాణించే వారు ఒకే రోజులో వెళ్లి పని చూసుకొని తిరిగి రావచ్చు. రైళ్లలో అధిక ప్రయాణ సమయం దృష్ట్యా.. విమానాలను ఎంచుకుంటున్నవారు ఇక మీదట హైస్పీడ్ రైళ్లలో ప్రయాణించటానికి ముందుకొచ్చే అవకాశాలున్నాయి. దీనివల్ల ప్రయాణికులకు డబ్బు ఆదా కావటమేగాక విమానాశ్రయాల మీద ఒత్తిడి తగ్గుతుంది. విమానాల నుంచి వెలువడే కర్బన ఉద్గారాలతో పోల్చితే రైళ్ల నుంచి వెలువడే ఉద్గారాలు 80% తక్కువ. ఆ విధంగా పర్యావరణానికీ మేలు జరుగుతుంది. హైస్పీడ్ రైళ్లతో కంపెనీలు రెండో దశ (టైర్-2) నగరాలకు తమ ఆఫీసులను తరలించుకోవటానికి అవకాశం లభిస్తుంది. ఉద్యోగులు శివార్లు, చిన్న పట్టణాలు, గ్రామాల్లో ఉంటూ మహా నగరాలకు వెళ్లి విధులు ముగించుకొని రావచ్చు. తద్వారా, మెగాసిటీలపై ఒత్తిడి తగ్గుతుంది. కాగా, ప్రతిపాదిత హైస్పీడ్ రైల్ కారిడార్లతో మధ్య, దక్షిణ భారతాన్ని అనుసంధానించే కేంద్రంగా హైదరాబాద్ మారనుంది. అంతేకాదు.. దేశ మౌలిక సదుపాయాల రంగంలో అత్యంత కీలక రాష్ట్రంగా తెలంగాణ అవతరిస్తుందని, తద్వారా దేశ రాజకీయాల్లో కూడా రాష్ట్రానికి ప్రాధాన్యం పెరుగుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, టూరిజం, లాజిస్టిక్స్, ఫార్మా, ఐటీ, నిర్మాణ, నిర్వహణ, సేవల రంగాల్లో 10-15 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా, హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి పదేళ్ల సమయం పట్టవచ్చని సమాచారం. అలాగే.. జిల్లాకొక బాలిక హాస్టల్‌ను ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలోని 33 జిల్లాలకూ 33 బాలికల హాస్టళ్లు రానున్నాయి.

# తెలంగాణ తీరని అన్యాయం

మొదటి తరువాయి

ఆదివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడుతూ ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లను పలుమార్లు కలిసినా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు లేకపోవడం తీవ్ర నిరాశపరిచిందని అన్నారు. మూసీ పునర్జీవం, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), హైదరాబాద్ నగర అభివృద్ధికి సంబంధించి మెట్రో రైల్ విస్తరణ, ఇతర మౌలిక సదుపాయాల కోసం బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని ఆశించామని చెప్పారు. బయో ఫార్మా అంటే కేంద్రానికి గుర్తు రావాల్సింది తెలంగాణ అనీ, కేంద్రం ప్రకటించిన బయో ఫార్మాలో నిధులను పొందుపరచకపోవడం తీవ్ర నిరాశపరిచిందని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఎలక్ట్రానిక్స్‌కు రూ.40 వేల కోట్ల కేటాయింపులు చేశారని వివరించారు. ఎలక్ట్రానిక్స్ అంటే హైదరాబాద్ అన్నట్టుగా పేరుగాంచిందనీ, తెలంగాణకు ఈ విభాగంలోనూ నిధులివ్వకపోవడం అన్యాయమని విమర్శించారు. ఫార్మా హబ్‌గా హైదరాబాద్ గుర్తింపు పొందిందనీ, కోవిడ్ సమయంలో భారత్‌కే కాకుండా ప్రపంచానికి ఔషధాలను అందించిందని గుర్తు చేశారు. ఫార్మా హబ్‌లో కూడా తెలంగాణ ప్రస్తావన లేదన్నారు.

ఆరేంజ్ ఎకానమీలో అన్యాయం

తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగంపైన దృష్టిపెట్టిందని భట్టి అన్నారు. గ్లోబల్ సమ్మిట్-2047 విజన్ డాక్యుమెంట్‌లోనూ ప్రపంచ ప్రఖ్యాత క్రీడాకారుడితో



క్రీడలు నిర్వహించామని చెప్పారు. క్రీడారంగంపైన ప్రత్యేక దృష్టితో ముందుకెళ్తున్న తెలంగాణ కేంద్రానికి ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. ఆరెంజ్ ఎకానమీలో హైదరాబాద్ సెంట్రిక్‌ను ముంబయికి తరలించారని అన్నారు. తెలంగాణ ఏం తప్పు చేసిందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆడియో, వీడియో, గేమింగ్ కామెక్స్ లాంటి వాటికి హైదరాబాద్ కేంద్రమని వివరించారు. ఆరెంజ్ ఎకానమీలో హైదరాబాద్‌కు అన్యాయం జరిగిందన్నారు. హైదరాబాద్ మెడికల్ హబ్‌గా అభివృద్ధి చెందుతున్నదని చెప్పారు. రీజినల్ మెడికల్ వ్యాల్యూ హబ్‌లో ఇతర రాష్ట్రాలకు ఇచ్చి తెలంగాణకు ఎందుకివ్వలేదని అడిగారు. టూరిజం విభాగంలో కూడా తెలంగాణను పొందుపరచకపోవడం అన్యాయమని విమర్శించారు. రేర్ ఎర్త్ మినరల్స్‌లో కూడా తెలంగాణపై కేంద్రం దృష్టి సారించలేదని అన్నారు. సెమీ కండక్టర్లను మంజూరు చేయాలని మోడీని కోరినా తెలంగాణకు మొండిచేయి చూపించారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమంపై ఈ బడ్జెట్ దృష్టి సారించలేదని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచిందని చెప్పారు. గ్రామీణ పేదలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా అభివృద్ధి చేసేలా ముందుకెళ్తున్నామని అన్నారు. రాష్ట్రానికి ప్రోత్సాహం అందించకుండా కేంద్రం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని రాష్ట్రాలకు నాలుగు శాతానికి అవకాశమివ్వాలని కోరామని గుర్తు చేశారు. కేంద్రం మాత్రం 4.3 శాతం పెట్టుకుందని వివరించారు. భారత్‌లో తెలంగాణ అంతర్భాగం కాదా?అని ప్రశ్నించారు. ప్రజల జీవన ప్రమాణాలు ఆర్థిక స్థితిగతులు పెంచడానికి మౌలిక సదుపాయాలు కల్పించే వీలుగా బడ్జెట్ ఉండాలని సూచించారు

# సుప్రీం అంటే మీరేనా?

మొదటి తరువాయి

ఒక సందర్భంలో ఇదంతా సిల్లీ వ్యవహారమనీ, కేవలం రాజకీయ కక్షతోనే సాగిస్తున్న డ్రామా అంటూ ఆయన అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. సిట్ ఇచ్చిన నోటీసుల మేరకు... కేసీఆర్ ఆదివారం భారీ కాన్వాయ్ తో ఎర్రవల్లి ఫామ్‌హౌస్ నుంచి మధ్యాహ్నం 12.30గంటల సమయంలో నందినగర్ నివాసానికి చేరుకున్నారు. ఇతరులు అటువైపు రాకుండా కట్టసీఆర్ నివాస పరిసరాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ విజయ్ కుమార్, మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, గ్రేహౌండ్స్ కమాండెంట్ రవీందర్ రెడ్డి, కూకట్‌పల్లి డీసీపీ రితురాజ్, శంషాబాద్ అదనపు ఎస్పీ ఎఎస్ రావు, ఏసీపీలు శ్రీధర్ రికార్డింగ్ పరికరాలతో ఆయన నివాసానికి చేరుకున్నారు. రెండో అంతస్తులో వెయిట్‌చేస్తున్న సిట్ అధికారుల వద్దకు న్యాయవాదులతో కలిసి మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో కేసీఆర్ వచ్చారు. విచారణ గదిలోకి న్యాయవాదులను అనుమతించ లేదు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు




మొదటి అంతస్తులో ఉండి పరిస్థితిని సమీక్షించారు. మధ్యాహ్నం 3.10గంటలకు విచారణ ప్రారంభించారు. ఫోన్ ట్యాపింగ్ జరుగుతున్నట్టు మీకు ముందుగానే తెలుసా..? మీకు అవసరమైన వ్యక్తుల సమాచారం కోసం వారి ఫోన్లు ట్యాపింగ్ చేయమని అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావును ఆదేశించారా? ఈ విషయంలో అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావును కూడా ఉపయోగించుకున్నారా? అనే ప్రశ్నలతో అధికారులు విచారణను ప్రారంభించినట్టు తెలిసింది. అయితే, ఉదయమే ఇంటెలిజెన్స్ అధికారులు సీఎంగా ఉన్న తనను కలిసి శాంతిభద్రతల సమాచారం చెప్పేవారనీ, ఆ సమాచారం ఎలా సేకరించారనే విషయం తనకు అప్రస్తుతమని కట్టసీఆర్ చెప్పినట్టు తెలిసింది. దేశ భద్రత, ప్రభుత్వ సుస్థిరత, మావోయిస్టుల కదలికలపై ఇంటెలిజెన్స్ అధికారులు ఫోన్ ట్యాపింగ్ చేస్తుంటారు. అది వారి విధుల్లో భాగమని మీకు తెలియదా? అని అడగ్గా కట్టసీఆర్ సిట్ అధికారులను ఎదురు ప్రశ్నించినట్టు తెలిసింది. సుప్రీం నుంచి వచ్చిన ఆదేశాలతోనే ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్టు గతంలో తాము అరెస్ట్ చేసి విచారించిన అధికారులు తెలిపిన విషయాన్ని వివరిస్తూ ..ఆ సుప్రీం మీరేనా? అని కేసీఆర్‌ను ప్రశ్నించగా దానికి ఆయన నేరుగా సమాధానమివ్వలేదని సమాచారం.

# రూ.53.47 లక్షల కోట్లతో కేంద్ర బడ్జెట్

మొదటి తరువాయి

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఇందులో మూలధన వ్యయానికే రూ.12.21 లక్షల కోట్లను కేటాయించారు. గత ఏడాదితో పోలిస్తే 8 శాతం అంటే.. దాదాపు లక్ష కోట్లను పెంచారు! భారత్ సహా ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య చిప్‌ల కొరత! దాని పరిష్కారానికి గతంలో ఏర్పాటు చేసిన ఇండియా సెమీకండక్టర్ మిషన్‌ను విస్తరించారు. రూ.22,919 కోట్లతో గత ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించిన ఎలక్ష?ట్రనిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ స్కీమ్‌కు కేటాయింపులను రూ.40 వేల కోట్లకు పెంచారు. అంతేనా, ఇప్పుడు ప్రపంచమంతా రేర్ ఎర్త్ మినరల్స్ చుట్టూ తిరుగుతోంది. అందుకే, గత ఏడాది నవంబరులో ప్రారంభించిన రేర్ ఎర్త్ పర్మినెంట్ మాగ్నెట్స్ స్కీముకు కొనసాగింపుగా రేర్ ఎర్త్ కారిడార్స్ ఏర్పాటు చేయనున్నారు. ఆ ఖనిజాలు అధికంగా ఉన్న ఒడిసా, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చేయూత ఇవ్వనున్నారు. ఎగుమతి చేసే సముద్ర ఉత్పత్తుల ప్రాసెసింగ్‌కు ఉపయోగించే నిర్దిష్ట ముడి సరుకులపై సుంకం లేని దిగుమతుల పరిమితిని ఒకటి నుంచి మూడు శాతానికి పెంచారు. లెదర్, జౌళి ఉత్పత్తులు, సింథటిక్ ఫుట్‌వేర్ ఉత్పత్తుల ఎగుమతుల గడువును ఆరు నెలల నుంచి ఏడాదికి పెంచారు. కొన్ని రకాల రసాయనాల కోసం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. అందుకే, మూడు కెమికల్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే, కంటెయినర్ల తయారీకి ఇప్పుడు డిమాండ్ పెరిగింది. అందుకే, రాబోయే ఐదేళ్లలో ఇందుకు రూ.10 వేల కోట్లను ఖర్చు చేయాలని సంకల్పించారు. బయో ఫార్మా మాన్యుఫాక్చరింగ్ హబ్ ఏర్పాటుకు రూ.10 వేల కోట్లను కేటాయించారు. ట్రంప్ సుంకాలతో దెబ్బతిన్న టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి సమ్మిళిత, సమగ్ర వ్యూహాన్ని రచించారు. మరిన్ని మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. 'స్వదేశీ'కి మూడంచెల వ్యూహాన్ని సిద్ధం చేశారు. మొదటి దశలో.. ఇతర దేశాలపై ఆధారపడాల్సి వస్తున్న రక్షణ, ఇంధన, ఆరోగ్య రంగాల్లో స్వయంసమృద్ధిపై వెంటనే దృష్టి పెట్టనున్నారు. ఐదు మెడికల్ హబ్‌లు, మూడు ఆయుర్వేద సంస్థలను ఏర్పాటు చేస్తారు. రెండో దశలో.. ఇతర దేశాలతో పోటీ పడేలా



సెమీ కండక్టర్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ ఎగుమతులకు పెద్దపీట వేయనున్నారు. మూడో దశలో.. దేశీయంగా సరసమైన ధరకు దొరకని ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటారు. వెరసి, ఒక్క మౌలిక సదుపాయాల రంగాని (ఇన్ఫ్రా)కే దాదాపు రూ.12 లక్షల కోట్లను ఖర్చు చేయనున్నారు. కాగా.. ఈసారి బడ్జెట్లో తెలుగు రాష్ట్రాలకు కాస్త ఊరట దక్కింది. దేశవ్యాప్తంగా ప్రకటించిన ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లలో మూడు హైదరాబాద్ నుంచే ప్రారంభం కానున్నాయి. వీటిలో రెండు ఏపీతోనూ అనుసంధానం అవుతాయి.

ఏపీలో రేర్ ఎర్త్ మినరల్ కారిడార్ ఏర్పాటు చేస్తారు. ఇక, హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్‌గా మారిన సంగతి తెలిసిందే. విశాఖలోనూ భారీ డేటా సెంటర్లు వస్తున్నాయి. వీటిని మరింత ప్రోత్సహించేలా విదేశీ కంపెనీలకు 2047 వరకూ ట్యాక్స్ హాలీడే ప్రకటించారు. జిల్లాకు ఒకటి చొప్పున బాలికల వసతి గృహాలూ ఏర్పాటు కానున్నాయి. అన్నదాతకు బడ్జెట్లో పెద్దగా తాయిలాలు లేవు. కానీ, కొబ్బరి రైతులకు కోకోనట్ ప్రమోషన్ స్కీమ్ ప్రకటించారు. జీడిపప్పు, కోకో, చందనం ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధికి ప్రణాళికలు రచించారు. మహిళలకు సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల తరహాలో సెల్ఫ్ హెల్ప్ మార్ట్‌లు మినహా పథకాలు ప్రకటించలేదు. ఎంఎ?సఎంఈలకు రూ.10 వేల కోట్లతో ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్‌ను; రూ.2000 కోట్లతో సెల్ఫ్ రిలయంట్ ఇండియా ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నారు. చివరిగా.. బడ్జెట్‌పై స్టాక్ మార్కెట్ పెదవి విరిచింది. ప్రారంభంలో పాజిటివ్‌గా కదలాడిన మార్కెట్ ఒక సందర్భంలో కుప్పకూలింది. సెన్సెక్స్ ఏకంగా 2400 పాయింట్లు పడిపోయింది. ఇందుకు కారణం.. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌ను నిరుత్సాహపరచడానికి సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ)ను ఫ్యూచర్స్‌లో 0.02 శాతం నుంచి 0.05 శాతానికి; ఆప్షన్స్‌లో 0.01 శాతం నుంచి 0.15 శాతానికి పెంచడమే.

ఏటా బడ్జెట్ వేళ.. చేనేత కళావైభవాన్ని చాటిచెప్పేలా నిర్మలా సీతారామన్ ధరించే చీరలు అందరి దృష్టిని ఆకర్షిస్తాయి. చేనేత కళపై తనకున్న మక్కువ చూపుతూ.. ఈ ఏడాది బడ్జెట్ ప్రసంగం కోసం సొంత రాష్ట్రమైన తమిళనాడుకు చెందిన కాంజీవరం చీరను ఎంచుకున్నారు. బంగారు రంగు జరీ అంచుతో ఉన్న ముదురు ఎరుపు(మెజెంటా) రంగు చీరను ఆమె పసుపు రంగు బ్లౌజ్‌తో జత చేశారు. త్వరలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన చీరను ధరించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.

85నిమిషాల పాటు సాగిన బడ్జెట్ ప్రసంగం

వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించిన నిర్మల... ఈ ఏడాది తన ప్రసంగాన్ని 85 నిమిషాల్లో క్లుప్తంగా ముగించారు. ఆదివారం ఉదయం 11గంటలకు ప్రారంభమైన ప్రసంగం మధ్యాహ్నం 12:25నిమిషాలకు ముగిసింది. నిర్మలా సీతారామన్ గత ప్రసంగాల నిడివిని పరిశీలిస్తే.. చాలా వరకు ప్రసంగాలు 90 నుంచి 120 నిమిషాల మధ్యలో ముగిశాయి. 2020లో బడ్జెట్ ప్రసంగం.. ఆమె కెరీర్‌లోనే కాకుండా దేశ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన ప్రసంగంగా రికార్డు సృష్టించింది. అప్పట్లో ఆమె 2గంటల 40నిమిషాల పాటు మాట్లాడారు. 2024లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌ను కేవలం 56నిమిషాల్లోనే ముగించారు. గతేడాది (2025) బడ్జెట్ ప్రసంగం 1గంట 14నిమిషాల పాటు, 2019లో ఆర్థికమంత్రిగా తొలి బడ్జెట్ ప్రసంగం 2 గంటల 17నిమిషాల పాటు కొనసాగింది.

# కేసీఆర్ పై సిట్ విచారణను తీవ్రంగా ఖండిస్తున్న బీఆర్ఎస్ పార్టీ









**మానకొండూరు/ కరీంనగర్ / పెద్దపల్లి, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు నిరసనగా మానకొండూరు నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. మండల అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు కలిసి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరి సురేష్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

**కరీంనగర్‌లో బీఆర్ఎస్ నిరసన**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు పంపడాన్ని తీవ్రంగా ఖండిస్తూ కరీంనగర్ నగరంలో బీఆర్ఎస్ పార్టీ నిరసన చేపట్టింది. నగర శాఖ అధ్యక్షుడు చల్లా హరిశంకర్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలోనే నోటీసులు పంపుతూ ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కేసీఆర్‌పై కక్షసాధింపు ధోరణితోనే విచారణలు జరుగుతున్నాయని, ప్రజాస్వామ్యబద్ధంగా బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పెద్దపల్లిలో బీఆర్ఎస్ నిరసన**

కేసీఆర్‌పై సిట్ విచారణను ఖండిస్తూ పెద్దపల్లిలో బీఆర్ఎస్ పార్టీ భారీ బైక్ ర్యాలీ నిర్వహించింది. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, యువ నాయకుడు దాసరి ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సమయంలో కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్ అని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజకుమార్, మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, కొయ్యడ సతీష్ గౌడ్, మోబిన్, బిక్షపతి, పెంచాల శ్రీధర్, సురేష్ బాబు, స్వామి, బెక్కం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లంపల్లి-సుందరగిరి తారు రోడ్డు పనులకు శ్రీకారం



**హుస్నాబాద్ నియోజకవర్గం, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామ ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోంది. సుందరగిరి వరకు తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో గ్రామంలో ఆనందం నెలకొంది. రోడ్డు కోసం కావాల్సిన మెటీరియల్‌ను ఇప్పటికే నిల్వ చేస్తూ పనులు మొదలయ్యాయి. ఇప్పటి వరకు వర్షాకాలంలో బురద, వేసవిలో దుమ్ము ధూళి కారణంగా విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర వైద్య అవసరాల సమయంలో అంబులెన్స్‌లు కూడా చేరలేకపోయాయి. రైతులు తమ పంటలను మార్కెట్‌కు తరలించడంలో కష్టాలు పడిన పరిస్థితిని గుర్తించి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో రోడ్డు పనులకు ఆమోదం లభించింది. గ్రామ సర్పంచ్ అలువాల శంకర్, గ్రామ ప్రజలు మంత్రి నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం విద్య, వైద్యం, వ్యవసాయం, వ్యాపార రంగాలకు ఊతమివ్వనుందని, గ్రామాభివృద్ధిలో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కానవేణి శివకుమార్, యువప్రతిభ యూత్ అధ్యక్షుడు సుదగోని శ్రీనివాస్, ఉప సర్పంచ్ కానవేణి జితేందర్, వార్డు సభ్యులు కొత్త మధు, కానవేణి మల్లయ్య, సుధగోని దినేష్, నాంపల్లి తిరుపతి, కానవేణి ఓదయ్య, చీమూర్తి నర్సయ్య, సుదగోని రామచంద్రం, కొండ జగన్, ఇట్టబోయిన, కొలిపాక భూమయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు ఈ తారు రోడ్డు ఏర్పాటుతో విద్యార్థులకు, ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# విజయవంతంగా ముగిసిన వొల్లల చందు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్




**కొత్తపల్లి, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేట గ్రామంలో వొల్లల నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వొల్లల చందు గౌడ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ముగింపు వేడుకలకు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు విన్నర్, రన్నర్ కప్పులు, నగదు బహుమతులు అందజేశారు. విజేతలకు 25 వేల రూపాయల నగదు, రన్నర్‌అప్ జట్టుకు 15 వేల రూపాయల నగదు బహుమతులు కప్పులతో పాటు అందించారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ గెలుచుకున్న క్రీడాకారులకు మెడల్స్, మెమెంటోలు అందజేశారు. నెలరోజుల పాటు ఎలాంటి లోటు లేకుండా టోర్నమెంట్ నిర్వహించిన నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. క్రీడాకారులు గెలుపు--ఓటములను సహజంగా స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏను రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రెడ్డవేణి మధు, మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలత--మహేష్, మాజీ ఎంపీటీసీ కమల మనోహర్, బావుపేట ఉపసర్పంచ్ భూస కరుణాకర్, ఖాజీపూర్ ఉపసర్పంచ్ పంజాల రమేష్, మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కర్ర సురేష్ శేఖర్, నిర్వాహకులు వొల్లల నాగరాజు గౌడ్, నాయకులు తిరుపతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమం రద్దు

**- కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి, ఫిబ్రవరి 01 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పెద్దపల్లి కలెక్టరేట్‌లో ఫిబ్రవరి 2న జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదివారం ప్రకటించారు. ప్రజలు వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావద్దని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల మోడల్ కోడ్ అమలులో ఉండటంతో అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పురపాలక ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమం పునరుద్ధరించబడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.


# వానప్రవేశంతో సంపూర్ణమైనా సమ్మక్క-సారలమ్మ మేడారం జాతర




**మంకొండూర్ ,ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

గన్నేరువరం మండలం మైలారం గ్రామంలో నాలుగు రోజులుగా కొనసాగిన శ్రీ సమ్మక్క--సారలమ్మ జాతర నిన్న రాత్రి అమ్మవార్ల వానప్రవేశంతో సంపూర్ణమైంది. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు చెల్లించారు. చైర్మన్ విలాసాగరం రామచంద్రం మాట్లాడుతూ గ్రామ యువకులు సహకరించడంతో జాతర విజయవంతమైందని, వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మక్క పూజారి బుర్ర రాములు, సారలమ్మ పూజారి తోట రాజేశం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అటు గన్నేరువరం మండల కేంద్రంలోని జాతర కూడా అత్యంత వైభవంగా జరిగింది.

# కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఐఏఎస్‌కు జన్మదిన శుభాకాంక్షలు



**కరీంనగర్, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఐఏఎస్ జన్మదినాన్ని పురస్కరించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంలో టీఎన్జీవోల జిల్లా శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కమిషనర్‌ను కలిసిన టీఎన్జీవోలు ప్రతినిధులు వెంకటేశ్వర స్వామి కండువా, శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కమిషనర్ సేవలు ప్రశంసనీయమని, నగర అభివృద్ధి కోసం ఆయన తీసుకుంటున్న వినూత్న నిర్ణయాలు అభినందనీయమని అన్నారు. ప్రజలు--ప్రభుత్వ ఉద్యోగుల మధ్య సమన్వయ వారధిగా నిలుస్తూ కరీంనగర్‌ను సర్వతోముఖాభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీఎన్జీవోలు ముద్రించిన 2026 డైరీని కమిషనర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘము లక్ష్మణరావు, కిరణ్ కుమార్ రెడ్డి, హర్వీందర్ సింగ్, గూడ ప్రభాకర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, ఏవీ రాజేశ్వరరావు, కర్ణాకర్, నారాయణ, పూర్ణచందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఈశాల తక్కల్లపల్లి జాతర హుండీ లెక్కింపు



**పాలకుర్తి, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో జరిగిన శ్రీ సమ్మక్క--సారలమ్మ జాతర హుండీ ఆదాయం లెక్కింపు ఆదివారం జరిగింది. భక్తులు వనదేవతలకు భక్తి శ్రద్ధలతో సమర్పించిన నగదును ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హుండీలు తెరిచి లెక్కించారు. మొత్తం మూడు లక్షల రూపాయల ఆదాయం వచ్చినట్టు ఆలయ కమిటీ చైర్మన్ గాలిపల్లి నర్సయ్య తెలిపారు. హుండీ లెక్కింపు సందర్భంగా బసంతనగర్ ఎస్ఐ నూతి శ్రీధర్ గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బండి శ్రీనివాస్, తోట స్వప్న మహేష్, అన్నం లక్ష్మీ నారాయణ, గౌరవ అధ్యక్షులు ఎర్రం మల్లేశం, ములుకాల కొమురయ్య, వైస్ చైర్మన్ తుంగ నర్సయ్య, కోశాధికారి గాలిపల్లి దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అధ్యక్షురాలు కవిత సమక్షంలో జాగృతిలో చేరికలు



**కరీంనగర్, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ జాగృతి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో మున్సిపల్ 12వ డివిజన్‌కి చెందిన ఐయిల్ల ప్రసన్న, 18వ డివిజన్‌కి చెందిన ఉలేందుల నరేష్, 35వ డివిజన్‌కి చెందిన మాధవిలతలు జాగృతిలో చేరారు. రాష్ట్ర అధ్యక్షురాలు కవిత సమక్షంలో వీరికి కండువాలు కప్పి ఆహ్వానం పలికారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ జాగృతి మున్సిపల్ ఎన్నికల్లో అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్‌తో కలిసి పోటీ చేస్తుందని, కరీంనగర్‌లో సింహం గుర్తు మీద పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కరీంనగర్ ఉద్యమాలకు ఖిల్లాగా నిలిచినప్పటికీ, గత పాలకులు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారని, అవినీతి కారణంగా స్మార్ట్ సిటీ పేరుకే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.బీజేపీ, బీఆర్ఎస్ ఒప్పంద రాజకీయాలు చేస్తున్నాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. నగర అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేసే నాయకులు అవసరమని, అలాంటి నాయకులకు జాగృతిలో స్థానం ఉందని తెలిపారు. అభివృద్ధి లక్ష్యంతో, సామాజిక తెలంగాణ నినాదంతో ముందుకు వస్తున్న జాగృతి--ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులను సింహం గుర్తు మీద ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

# మూడు కర్తవ్యాలే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్



**కరీంనగర్, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ దేశ అభివృద్ధి దిశగా చారిత్రకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి అనే మూడు కర్తవ్యాలే ఈ బడ్జెట్ లక్ష్యమని ఆయన అన్నారు.వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా, ప్రపంచ మార్కెట్లో పోటీ పడేలా భారత ఆర్థిక ప్రయాణాన్ని స్థిరంగా కొనసాగించే విధంగా బడ్జెట్ రూపుదిద్దుకున్నదని తెలిపారు. ఉపాధి కల్పన, మధ్యతరగతికి ఊరట, టెక్నాలజీ అభివృద్ధి ప్రధాన దిశగా బడ్జెట్ రూపొందించబడిందని, ఆదాయపు పన్ను విధానంలో మార్పులు వేతన జీవులకు ప్రయోజనం చేకూరుస్తాయని అన్నారు.నిరుద్యోగతను తగ్గించేందుకు ఐదు ప్రధాన పథకాలను ప్రకటించడం హర్షనీయమని, వ్యవసాయ రంగానికి డిజిటల్ అగ్రికల్చర్, ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహకాలు, ఆయిల్ సీడ్స్ అభియాన్ బలోపేతం వంటి చర్యలు కొత్త ఉత్తేజాన్ని ఇస్తాయని పేర్కొన్నారు.బడ్జెట్ కేటాయింపుల పట్ల బీజేపీ జిల్లా శాఖ తరఫున హర్షం వ్యక్తం చేస్తూ, ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా మాఘ పౌర్ణమి యజ్ఞం



**కరీంనగర్, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కరీంనగర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో మాఘ పౌర్ణమి పుష్యమి నక్షత్రం యజ్ఞం ఘనంగా జరిగింది. కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, మాదాసు ప్రణయ్ కుమార్--నాగరాణి, సాగర్--నవీన పాల్గొనగా, శ్రీ శంకర్ ఆర్యన్ యజ్ఞాన్ని గావించారు.ప్రిన్సిపాల్ సముద్రాల రాజమౌళి మాట్లాడుతూ యజ్ఞం హిందూ ధర్మంలో అత్యంత పవిత్రమైనదని, ఇది కేవలం పూజ మాత్రమే కాకుండా మానవ జీవితానికి ఆధ్యాత్మిక, శాస్త్రీయ ప్రయోజనాలను అందిస్తుందని తెలిపారు. యజ్ఞం వేయిజన్మల పుణ్యఫలం అని పేర్కొన్నారు. అనంతరం 6 నెలల నుండి 12 సంవత్సరాల పిల్లలకు సువర్ణ ప్రశానము నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, మేచినేని దేవేందర్ రావు, గట్టు శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, డాక్టర్ నాళ్ల సత్య విద్యాసాగర్, గోలి పూర్ణచందర్, కొత్తూరి ముకుందం, గట్టు రాం ప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, అప్పిడి వకులాదేవి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌పై ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తీవ్ర విమర్శలు

**కరీంనగర్ ,ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌పై ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రజలు--కార్మికులను పూర్తిగా విస్మరించిన బడ్జెట్ అని ఆయన పేర్కొన్నారు.ఎంజైరేగా పథకానికి నిధులను తగ్గించడం గ్రామీణ కుటుంబాల జీవనాధారాన్ని కూల్చివేయడమేనని, కార్మికుల హక్కులు, న్యాయమైన వేతనాలు, సామాజిక భద్రతపై ఎటువంటి చర్యలు లేవని విమర్శించారు. పెద్ద కార్పొరేట్‌లకు అనుకూలంగా ఉండే విధానాలను బలోపేతం చేస్తూ కార్మికులను మరింత అభద్రతలోకి నెట్టివేస్తున్నారని అన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన బడ్జెట్



దేశ ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతున్న సమయంలో రికవరీకి ఎటువంటి రోడ్‌మ్యాప్ ఇవ్వలేదని మండిపడ్డారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు అనుకూలంగా, ఇతర రాష్ట్రాలకు వ్యతిరేకంగా కేటాయింపులు చేశారని ఆరోపించారు.ఆరోగ్యం, ఆహారం వంటి కీలక రంగాల్లో సబ్సిడీలు తగ్గించడం పేదలు, కార్మికులు, అణగారిన వర్గాల పట్ల ప్రభుత్వానికి శ్రద్ధలేదని స్పష్టం చేశారు. రైతుల సమస్యలు, యువత ఉపాధి, ద్రవ్యోల్బణం, లింగ అసమానత వంటి అంశాలపై బడ్జెట్ మౌనంగా ఉందని విమర్శించారు.ఈ బడ్జెట్ ప్రజా వ్యతిరేకం, కార్మిక వ్యతిరేకం, రైతు వ్యతిరేకం, సమాఖ్య వ్యతిరేకమని బండారి శేఖర్ అన్నారు. మోదీ ప్రభుత్వం విధించిన ఆర్థిక ఎజెండాను ప్రతిఘటించేందుకు శ్రామికులు, రైతులు, యువత, ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా ముందుకు రావాలని జిల్లా కమిటీ పిలుపునిచ్చింది.

# కేంద్ర ఉద్యోగులకు, పెన్షనర్లకు నిరాశ కలిగించిన బడ్జెట్

**కరీంనగర్, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2026--27 బడ్జెట్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లలో తీవ్ర నిరాశను కలిగించింది. 50 లక్షల ఉద్యోగులు, 70 లక్షల పెన్షనర్లకు ఎటువంటి ఊరట ఇవ్వకుండా, 8వ వేతన కమిషన్ ఏర్పాటు ప్రకటన మాత్రమే చేసి, కొత్త స్కేలు అమలు విషయంలో స్పష్టత ఇవ్వలేదని విమర్శలు వెల్లువెత్తాయి.జనవరి 2026 నుంచే కొత్త జీతాలు, పెన్షన్లు అమలు కావాలని ఆశించిన ఉద్యోగులు, పెన్షనర్లు ఈ బడ్జెట్‌లో కనీసం 30% ఇంటీరిమ్ రిలీఫ్ ఉంటుందని ఎదురుచూశారు. కానీ ఆర్థిక మంత్రి ఎటువంటి ప్రకటన చేయకపోవడం నిరాశ కలిగించింది. రాష్ట్ర ఉద్యోగులకు ప్రతి 4--5 ఏళ్లకోసారి వేతనాలు పెరుగుతుండగా, కేంద్ర ఉద్యోగులు మాత్రం 10



ఏళ్లు దాటినా పెరుగుదల లేకపోవడం అన్యాయమని పేర్కొన్నారు.తెలంగాణలో హైదరాబాద్‌లో మాత్రమే సిజిహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ ఉండగా, కరీంనగర్, వరంగల్, నిజామాబాదులో సౌకర్యాలు కల్పించాలని ఏడేళ్లుగా డిమాండ్ చేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వేలో వృద్ధులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రాయితీలు కరోనా సమయంలో బీజేపీ ప్రభుత్వం ఎత్తివేసి ఇప్పటివరకు పునరుద్ధరించలేదని విమర్శించారు. కరోనా సమయంలో నిలిపివేసిన డి.ఎ., డి.ఆర్. 36 విడతలను ఇప్పటికీ విడుదల చేయకపోవడం ఉద్యోగులు, పెన్షనర్లకు అన్యాయమని పేర్కొన్నారు. దేశ ఆర్థిక స్థితి మెరుగుపడిందని ప్రకటిస్తున్న కేంద్ర ప్రభుత్వం తమ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పట్టించుకోవడం లేదని, ఇకనైనా ఈ అంశాలపై దృష్టి పెట్టకపోతే ఉద్యమం తప్పదని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల రామేశం హెచ్చరించారు.

# మానకొండూరులో జోరుగా కాంగ్రెస్ ప్రచారం

**మానకొండూర్, ఫిబ్రవరి 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపు కోసం వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్ ఆధ్వర్యంలో జరిగిన మండల పార్టీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను ఆషామాషీగా తీసుకోకుండా, 8వ డివిజన్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి విజయం కోసం అందరూ కృషి చేయాలని, ప్రచార కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్




మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని అన్నారు.అభ్యర్థి గోపు మల్లారెడ్డి కూడా కార్యకర్తలందరూ ఎన్నికల ప్రచారంలో భాగస్వాములు కావాలని, గెలుపు కోసం ఏకతాటిపై పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి, మాజీ కార్పొరేటర్ సల్ల రవీందర్, తమ్మనవేణి రమేశ్ యాదవ్, కంది లక్ష్మినారాయణరెడ్డి, చిందం కిష్టయ్య, దాసం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్ అల్గునూరులో కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డితో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజల అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు. అల్గునూరులో ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు.గోపు మల్లారెడ్డికి కౌండిన్య యూత్ క్లబ్ సభ్యులు మద్దతు ప్రకటించారు. గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

# ఇండోనేషియాలో కొండచరియల బీభత్సం

-53కి పెరిగిన మృతుల సంఖ్య
-మరో 10 మంది ఆచూకీ గల్లంతు

**జకార్తా ఫిబ్రవరి 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇండోనేషియాలోని జావా ద్వీపంలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య 53కి పెరిగింది. వారం రోజుల క్రితం జరిగిన ఈ దుర్ఘటనలో మరో 10మంది ఆచూకీ ఇంకా తెలియరాలేదని సహాయ కార్యకర్తలు తెలిపారు. రాజధాని జకార్తాకు సమీపంలోని పసిర్లాంగూ గ్రామంలో కుండపోత వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి.



50కి పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. 650మందికి పైగా నిర్వాసితులయ్యారు. వెంటనే సైన్యం, పోలీసులు, వలంటీర్లు వేలాదిగా రంగంలోకి దిగారు. మట్టి, బురదతో నిండిపోయిన ఆ ప్రాంతాల్లో రాళ్ళురప్పలను తొలగించి, మృత దేహాలను వెలికితీసేందుకు వారు శ్రమిస్తున్నారు. శనివారం నాటికి 53 మృతదేహాలను గుర్తించామని సహాయకుల బృందం అధిపతి అదె డియాన్ చెప్పారు. అక్కడ శిక్షణ పొందుతున్న 23మంది నావికా సిబ్బంది కూడా ఈ దుర్ఘటనలో చిక్కుకున్నారని ఇండోనేషియా నావికాదళం తెలిపింది. అక్టోబరు నుండి మార్చి వరకు సాగే వర్షాల సీజనులో ఇండోనేషియాలో ఇటువంటి సంఘటనలు జరుగుతుంటాయి. అడవులు అదృశ్యం కావడంతో ఈ ప్రమాదాలు ఎక్కువవుతున్నాయని ప్రభుత్వం చెబుతోంది

# విద్యారంగానికి తీరని అన్యాయం

**అంగిడి కుమార్**

**కరీంనగర్, ఫిబ్రవరి 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి కేటాయించిన నిధులు తక్కువగా ఉండటంపై కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం 53.47 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యకు కేవలం 1,39,289 కోట్లు, అంటే 2.6 శాతం మాత్రమే కేటాయించడం అన్యాయమని ఆయన అన్నారు.పాఠశాల విద్యకు 78,572 కోట్లు, ఉన్నత విద్యకు 50,078 కోట్లు కేటాయించినా, సమగ్ర శిక్ష అభియాన్ వంటి పథకాల లక్ష్యాలు నెరవేరవని, అంగన్వాడీలు, పీఎం–శ్రీ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, మధ్యాహ్న భోజనానికి నిధులు సరిపోవని ఆయన పేర్కొన్నారు. నూతన జాతీయ విద్యా విధానం--2020 పేరుతో కార్పొరేట్




కంపెనీల అవసరాలకు అనుగుణంగా ఏఐ, డిజిటల్ ఇన్‌ఫ్రా, స్కిల్ డెవలప్మెంట్ కోర్సులకు అధిక నిధులు కేటాయించడం విద్యార్థుల అసలు అవసరాలను విస్మరించడం అని విమర్శించారు. కొఠారి కమిషన్ సిఫారసుల మేరకు దేశ జీడీపీలో 6 శాతం విద్యకు కేటాయించాల్సిన అవసరం ఉందని, కానీ ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయలేదని అన్నారు. గ్రామీణ విద్యార్థులు మౌలిక సదుపాయాల లేమితో వెనుకబాటుకు గురవుతున్నారని, యూనివర్సిటీలలో పరిశోధనలకు నిధులు లేకపోవడం, ఉపాధ్యాయుల కొరత, శిక్షణ లోపం వంటి సమస్యలు మరింత పెరుగుతున్నాయని ఆయన తెలిపారు. వైద్య విద్యలో కూడా సామాన్యులకు అవకాశాలు తగ్గిపోతున్నాయని, ఎయిమ్స్, ఐఐఎం, ఐఐటీలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందుబాటులోకి రావాలని డిమాండ్ చేశారు.బడ్జెట్ కేటాయింపులు పేపర్లకే పరిమితం అవుతున్నాయని, గతంలో కేటాయించిన నిధుల్లో 20--30% ఖర్చు చేయలేదని, మరోసారి విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని అంగిడి కుమార్ అన్నారు. బడ్జెట్‌ను సవరించి విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నిధులు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఉత్సాహంగా రన్ ఫర్ భారతమాత











**సఫిల్‌గూడ, ఫిబ్రవరి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

సఫిల్‌గూడ మినీ ట్యాంక్ బండ్ చౌరస్తా వద్ద రన్ ఫర్ భారతమాత బృందం నిర్వహించిన 5కె పరుగు అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. కృపా కాంప్లెక్స్, పాత నేరేడ్‌మెట్, దేవినగర్, సీతారామ్ నగర్, సఫిల్‌గూడ, ఆనంద్ బాగ్ ఎక్స్ రోడ్‌ల మీదుగా పరుగు కొనసాగింది. జాతీయవాదులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తి నినాదాలతో పరుగెత్తారు. పరుగు ప్రారంభానికి ముందు రివైవ్ ఫిట్‌నెస్ సెంటర్ బృందం వార్మప్ సెషన్ నిర్వహించింది.బాల విభాగంలో అభిలాష్, వర్షిత్ రాజ్ విజేతలుగా నిలిచారు. బాలికల విభాగంలో స్వప్న శ్రీ, లక్ష్మీ ప్రసన్న విజయాన్ని సాధించారు. తరుణ విభాగంలో అమర్‌కాంత్ సింగ్, ఆదర్శ్ రాజ్, శృతి ప్రతిభ కనబరిచారు. ప్రౌఢ విభాగంలో రాధిక అరుజున్, శ్రీనివాస్, కల్పన, సాగరిక విజేతలుగా నిలిచారు. 60 ఏళ్ల పైబడిన విభాగంలో రఘునాథ్ శర్మ, నళిని విజయాన్ని





అందుకున్నారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కె. ఎల్. ఎన్. స్వామి, ముఖ్య వక్తగా డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, రచయిత, సామాజిక కార్యకర్త మదన్ గుప్తా పాల్గొన్నారు. యువత స్వామి వివేకానంద ఆలోచనలను అనుసరించి దేశానికి సేవ చేయాలని, భారతదేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం 100 ఏళ్ల ప్రయాణం, సామాజిక సేవ, జాతీయవాద భావజాలాన్ని వివరించారు. విజేతలకు పతకాలు అందజేశారు.కార్యక్రమం వందేమాతరం గీతం, భారతమాత పూజతో ముగిసింది. పరుగు జరిగిన ప్రాంతం దేశభక్తి నినాదాలతో మార్మోగింది.

# మిర్యాలగూడ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సిపిఐ మద్దతు

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

మిర్యాలగూడ నియోజకవర్గ సమావేశం కామ్రేడ్ అంజన్న, పిల్లి రామలింగం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంలో మిర్యాలగూడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం వల్ల పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని, అందువల్ల భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సంపూర్ణ మద్దతు ఇవ్వాలని నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు. మిర్యాలగూడలోని 48 వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి సిపిఐ నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడం వలన సిపిఐకి కో-ఆప్షన్ నెంబర్




ఇవ్వడానికి ఎమ్మెల్యే అంగీకరించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల్ల శ్రీనివాస్, మండల కార్యదర్శులు జిల్లా యాదగిరి, పోలేపల్లి ఉదయ్ కుమార్, మహిళా సమైక్య నాయకురాలు ఎర్రబోతు పద్మ, ఎస్కే షమీం, లింగంపల్లి సైదమ్మ, జములకోటయ్య, సీనియర్ నాయకులు గజ్జల లక్ష్మీ నరసింహ రెడ్డి, కత్తుల బిక్షం, పుట్టల నాగయ్య, పేరుపొంగు లక్ష్మయ్య, శుద్ధ బోయిన రాములు, ఏఐఎస్ఎఫ్ నాయకులు జిల్లా యశ్వంత్, పేరుపాక సంతు తదితరులు పాల్గొన్నారు.


# హుజురాబాద్‌లో వేడెక్కిన ఎన్నికల ప్రచారం



**కరీంనగర్ ,ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

హుజురాబాద్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం వేడెక్కింది. కాంగ్రెస్ పార్టీ తరఫున నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో 3, 4, 18వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలకు గత పదేళ్లలో జరగని పనులు, గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ అభ్యర్థుల గెలుపు కోసం మద్దతు కోరారు.ప్రచారం సందర్భంగా ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులకు బ్రహ్మరథం పడుతూ, ఈసారి ఖచ్చితంగా గెలిపిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆశీర్వాదంతో మరింత బాధ్యతగా అభివృద్ధి చేస్తామని ప్రణవ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు



**కరీంనగర్, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు చోటుచేసుకున్నాయి. మాజీ కార్పొరేటర్ కచ్చు రవి ఆధ్వర్యంలో నగరంలోని 48వ డివిజన్ విద్యానగర్ కురుమవాడకు చెందిన నాయకులు గుంటి మధుమిత, ప్రశాంత్ తమ అనుచరులు 500 మందితో ఆదివారం రోజున బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం ఆయన నివాసంలో జరిగింది.అదే సమయంలో, మాజీ ఎంపిటిసి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగాధర లక్ష్మయ్య 16వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం ముగించుకుని తిరిగి వస్తూ ప్రమాదానికి గురయ్యారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వెంటనే వారిని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి, వైద్యుల వద్ద వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రెండు మూడు రోజుల్లో రికవరీ అవుతారని వైద్యులు తెలిపారు. పార్టీ నాయకులకు ఏవైనా సమస్యలు వచ్చినా అండగా ఉంటామని కమలాకర్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, మాజీ కార్పొరేటర్ వంగపల్లి రాజేందర్ రావు, మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, నాయకులు మిడిదొడ్డి నవీన్, గంగాధర కుమారుడు, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రేణుక ఎల్లమ్మ చండీ హోమం, పంచామృతాభిషేకం



**హుస్నాబాద్, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో వ్యాస పౌర్ణమి సందర్భంగా ఘనంగా పంచామృత అభిషేకం, కుంకుమ పూజ, చండీ హోమం నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదం పంపిణీ చేసి, ఉత్కాల రేణుక కుటుంబ సభ్యులు రవి--అశ్విత ఆధ్వర్యంలో మహా అన్నదానం చేపట్టారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు, శాసనమండలి సభ్యులు బసవరాజు సారయ్య, వడ్డేపల్లి శ్రీనివాస్, లావణ్య, కొండ్ర విజయ్ కుమార్, నిర్మల, కోడూరి శ్రీదేవి, రవీందర్, పచ్చిమట్ల రవీందర్ గౌడ్, సుమలతతో పాటు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.ఆలయ అర్చకులు తాటికొండ పరమేశ్వర్ శర్మ, కొత్తకొండ దేవస్థానం అర్చకులు వినయ్ శర్మ, శ్రావణ్ శర్మ, శశాంక్ శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సిబ్బంది నీల కుమారస్వామి, పున్న హనుమంతు, గీకూరు రమేష్, వీర రాజు సేవలో పాల్గొన్నారు.అమ్మవారి సేవలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ కార్యనిర్వాహణాధికారి పి. కిషన్ రావు ప్రత్యేక పర్యవేక్షణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

# ఓటర్లు పట్టణ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కై ఉత్తమ అభ్యర్థులను ఎన్నుకోవాలి.

**(తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల్లో 116 మున్సిపాలిటీలకు 7 మున్సిపల్ కార్పొరేషన్ లకు ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా రాసిన వ్యాసం)**

దేశాభివృద్ధిలో పట్టణీకరణ ఆధునికీకరణ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో పట్టణాల అభివృద్ధి విస్తరణ ప్రాముఖ్యత సంతరించుకుని ఉంది. ప్రపంచీకరణ విసురుతున్న పోటీని తట్టుకోవాలంటే పట్టణాలు ఆధునిక రీతిలో శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందాలి.
నగరాల/ పట్టణాల అభివృద్ధి అనేది మెరుగైన మున్సిపాలిటీల పాలన విధానాల మీద ఆధారపడి ఉంటుంది. మున్సిపాలిటీలకు నిర్దిష్ట కాలములో ఎన్నికల నిర్వహించి స్థానిక స్వపరిపాలనకు ప్రభుత్వంచర్యలు తీసుకుంటుంది. స్థానిక సంస్థల సాధికారితలో భాగంగా మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తుంది. మున్సిపాలిటీలో/ మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డు/డివిజన్ /కౌన్సిలర్/ కార్పొరేటర్ ల పాత్ర ప్రధాన మైంది. వార్డు /డివిజన్/పట్టణం అభివృద్ధి ప్రజలు ఎన్నుకునే కౌన్సిలర్ కార్పొరేటర్ నాయకత్వ దక్షత మీద ఆధారపడి ఉంటుంది ఎవరిని ఎన్నుకోవాలి? అనేది ఓటర్ల విజ్ఞతపై ఆధారపడి ఉంటుంది.

**ఓటు తల రాతను మార్చే సాధనం**

ప్రజాస్వామ్యంలో ఓటు అనేది కేవలం ఓటు మాత్రమేకాదు అది మన తలరాతనుమార్చే సాధనం.
వార్డ్/ డివిజన్/పట్టణ ప్రజల భవిష్యత్తును పిల్లల భవిష్యత్తు నిర్ధారించే ఒక వజ్రాయుధం. ఎన్నికల్లో డబ్బు ఉచిత ప్రలోభాలు మద్యం కులం బంధువుల వ్యామోహం ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. మాయమాటల వ్యామోహంలో పడి ఓటర్లు తప్పుడు వ్యక్తిని ఎన్నుకుంటున్నారు. ఫలితంగా నగరాలు పట్టణాలు అభివృద్ధి చెందడం లేదు. పట్టణాలు మురికి కూ పాలుగా కాలుష్య కాసారాలుగ
మారిపోయి ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.
ఓటరు తమ ఓటును అభివృద్ధి వైపే వేయాలి అనేధి నినాదానికే పరిమితం చేయకుండా అభివృద్ధికి పాటుపడే అభ్యర్థికేఓటువెయ్యాలి.
వార్డ్ / డివిజన్ / పట్టణ ప్రగతిని కాంక్షించే వారిని కౌన్సిలర్ గా/ కార్పొరేటర్ గాఎన్నుకోవాలి.
వార్డు/ డివిజన్/ పట్టణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడే ఉత్తమ అభ్యర్థిని కౌన్సిలర్ గా/ కార్పొరేటర్ గా ఎన్నుకోవాలి.
రాష్ట్రంలో జరిగే మున్సిపాలిటీ ఎన్నికల్లో కౌన్సిలర్/ కార్పొరేటర్ పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థుల నేర చరిత్ర' ప్రజాసేవలో వారు చేసిన గణనీయమైన సేవలు ప్రజలతో వారికి వున్న ప్రజా సంబంధాలు' ప్రజలకు ఎల్ల వేళలా అందు బాటులో వుండి వార్డ్/ డివిజన్ / పట్టణ భవిష్యత్ తరాలకు కావలసిన జీవన నాణ్యతను పెంపొందించే శక్తిసామర్థ్యాలు కలిగి పట్టణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు పాటు పడే ఉత్తమ అభ్యర్థులను విజ్ఞత గల ఓటర్లు తమ ఓటు ద్వారా ఎన్నుకోవాలి.

**అందుబాటులో ఉండే వ్యక్తిని ఎన్నుకోవాలి**

వార్డు/ డివిజన్/(పట్టణ) సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తిని ఎన్నుకోవాలి. ఆపదలో నేను ఉన్నాను అని భరోసా ఇచ్చే నాయకత్వం కావాలి . ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు భరోసానిచ్చి ముందు నిలబడే నిజమైన నాయకుడు కావాలి. గెలిచిన తర్వాత కనపడకుండా పోయేవాడు కాదు .కష్టంలో ప్రజల మధ్య ఉండేవాడు మనకు కావాలి. ఎన్నుకునే వ్యక్తి ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రజా సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం కల్పించాలి. సామాన్యులకు అందుబాటులో ఉండాలి .నిజాయితీగా సేవా దృక్పథం కలిగిన వ్యక్తిని
కౌన్సిలర్ గా / కార్పోరేటర్గా ఎన్నుకోవాలి.ఎన్నికల్లో డబ్బు ఖర్చు పెట్టి గెలిచేవాడు ఆ డబ్బును సంపాదించడం మీద దృష్టి పెడతాడు నిధులను దుర్వినియోగం చేస్తాడు .అవినీతి పాలనకు తెరతీస్తాడు. ప్రజల అభిమానాన్ని నమ్ముకుని సేవ చేయాలనే తపన ఉన్న వ్యక్తిని ఎన్నుకుంటే వార్డు /డివిజన్/ పట్టణం అభివృద్ధి జరుగుతుంది .అవినీతి లేని నేర రహితుడు నిజాయితీ పరుణ్ణి ఎన్నుకుంటే ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు యొక్క లాభాలు ప్రత్యక్షంగా ప్రజలకు చేరుతాయి. కౌన్సిలర్ /కార్పొరేటర్ పదవికి పోటీ చేసే అభ్యర్థి వార్డు/డివిజన్లో/ పట్టణంలో విద్యా వైద్య ఆరోగ్య5 వాతావరణ పర్యావరణ రంగాలను ఏ విధంగా అభివృద్ధి చేస్తాడో? ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాల అమలుకు నిధులను ఏ విధంగా సమీకరిస్తాడో బహిరంగంగా ప్రకటించాలి.

**వార్డు / డివిజన్/పరిస్థితులపై అవగాహన ఉన్న వ్యక్తిని కౌన్సిలర్ కార్పొరేటర్గాఎన్నుకోవాలి**

వార్డులో/ డివిజన్లో /పట్టణంలో లభించే భౌతిక వనరులు' సహజ వనరులు 'భౌగోళిక స్థితి గతుల మీధ అవగాహన వున్న విద్యావంతున్ని మేధావిని గుర్తించి ఓటువేయ్యాలి. స్థానికంగాప్రజలకు అందుబాటులో వుండి ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపి వార్డు /డివిజన్ ప్రజల అభివృద్ధికి పాటుపడే అభ్యర్థులను కౌన్సిలర్ గా /కార్పోరేటర్ గాఓటర్లు ఎన్నుకోవాలి.

**ప్రలోభాలు వద్దుబి నిజాయితీ ముద్దు "**

వార్డు /డివిజన్లోని (పట్టణ)ఓటర్లు ప్రలోభాలకు లొంగవద్దు.నోటుకు ఓటు అమ్ముకోవద్దు. ఎన్నికల సమయంలో ఇచ్చే 5 వేల రూపాయలకు ఆశపడి భవిష్యత్తును తాకట్టు పెట్టవద్దు. నాయకుడు ఎన్నికల్లోకోట్లు ఖర్చు చేసి గెలిచిన తర్వాత అంతకుమించి సంపాదిస్తాడు. ప్రజలను దోపిడి చేస్తాడు. ప్రజలకు సేవ చేయాలనే స్పృహ నేటి నాయకుల్లో లేదు. ఈరోజు డబ్బు తీసుకొని మనం ఓటు వేస్తే రేపు మన వార్డ్/డివిజన్కు కావాల్సిన మౌలిక మవసతులు రోడ్లు 'విద్య ఆరోగ్యం సదుపాయాలు రావు.
ప్రశ్నించే హక్కును కోల్పోతాము.




నోటుకు ఓటు భవిష్యత్తుకు ముప్పుగా భావించాలి.

**ప్రజా సేవకులను కౌన్సిలర్ గా కార్పోరేటర్స గా ఎన్నుకోవాలి**

ఓటర్లుఎలాంటి ఒత్తిడికి భయానికి తల వంచకుండ హేతుబద్ధంగా వ్యవహరించాలి. ప్రజలకు సేవ చేస్తున్న వారిని నిజంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్న అభ్యర్థికి ఓటు వెయ్యాలి.

**సెంటిమెంట్ పై ఓటు వేయరాదు**

కౌన్సిలర్ /కార్పొరేటర్అభ్యర్థి మనకులం మన మతం' మన బంధువు మా అన్నమా తమ్ముడు మా బావ మామామ అనే సెంటిమెంట్లతో ఓటు వేయడం అభివృద్ధికి అవరోధం. నాయకుడు సమర్థుడా? కాదా ?ప్రజా సమస్యలు పై అవగాహన ఉందా లేదా ?అని ఆలోచించాలి ?
అభ్యర్థి ఏ పాటి వాడో చూడాలి.
కేవలం కులం మతం బంధుత్వం వర్గం ప్రాతిపదికన ఓటు వేస్తే గెలిచిన నాయకుడు తన కులానికి తన వర్గానికి మేలు చేస్తాడు . వార్డుకు డివిజన్ కు న్యాయం చేయలేడు.

**వార్డ్/ డివిజన్ /పట్టణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడే వారిని ఎన్నుకోవాలి.**

అభివృద్ధికి కులం లేదు. ఆకలికిఎ మతం లేదు. రోడ్లు 'తాగు నీరు 'బడి మౌలిక వసతులు' పర్యావరణం ప్రజలందరికీ కావాలి. సంకుచిత భావాలనుండి ఓటరు బయటపడి వార్డు /డివిజన్ సమగ్ర అభివృద్ధి కొరకు పాటుపడే సామర్థ్యం నాయకత్వ లక్షణాలు ఉన్న వ్యక్తిని కౌన్సిలర్ గా కార్పొరేటర్ ఎన్నుకుంటేనే వార్డు/ డివిజన్ /పట్టణ ప్రజల జీవితాలలో వెలుగులు వస్తాయి. ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రగతి పురోగతి కోసం మనస్ఫూర్తిగా పని చేస్తానని నమ్మే అభ్యర్థికి ఓటు వెయ్యాలి.

**నిజాయితీ సామాజిక సేవ ఎన్నికకు గీటురాయిలి.**

నిజాయితీ గల అభ్యర్థికి ఓటు వెయ్యాలి. ఒక అభ్యర్థిని ఎన్నుకునేటపుడు అభ్యర్థి ఎంత సామాజిక సేవ చేశాడన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. సామాజిక సేవా పాలనా దక్షత ప్రజా సంబంధాలు నిబద్ధత నీతి నిజాయితీ అభ్యర్థి ఎన్నికకు గీటు రాయి కావాలి.ఓటర్లు మద్యానికి మందుకు బీరు బిర్యాని ముక్క చుక్కకు బానిసలై అవినీతి పరులను ఎన్నుకోవద్దు. అసమర్థులను అవినీతి పరులను ఓటుతో వేటు వెయ్యాలి . ఓటు ద్వారా వారిని బహిష్క రించాలి.

**ఉత్తమ అభ్యర్థులను ఎన్నుకోవాలి**

ఓటర్లు గాఢ నిద్ర మానుకొని ఉత్తమఅభ్యర్థులనుఎన్నుకోవాలి.ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో కౌన్సిలర్గా /కార్పొరేటర్ గా బాధ్యతలను నిర్వహించే సామర్థ్యం వున్న వారిని గుర్తించాలి . విద్యావంతులైన అభ్యర్థి మెరుగైన నిర్ణయాలు తీసుకోగలడని సాధారణ ఓటరు అర్థం చేసుకోవాలి. కౌన్సిలర్/ కార్పొరేటర్ అభ్యర్థి కి వార్డు డివిజన్ స్థితి గతులు పరిస్థితుల మీద మేధస్సుతో కూడిన దూర దృష్టితో కూడిన అభివృద్ధి దృక్పథం కలిగి వుండాలి.నేర రికార్డులు ఉన్న అభ్యర్థిని బహిష్కరించాలి. ఉచితాలకు స్వస్తి పలకాలి. ఉచితాలు ప్రకటించి ఓటర్లను ఆకర్షించేందుకు చేసే చర్యలు చట్ట విరుద్ధమైనవిగా ప్రకటించి అభ్యర్థి పైన ఎన్నిక కమిషన్ చర్యలుతీసుకోవాలి.

**పరిస్థితులపై అవగాహన**

వార్డు/ డివిజన్ /(పట్టణ) పరిస్థితులపై సంపూర్ణ అవగాహన.
సామాజిక ఆర్థిక చారిత్రిక సాంస్కృతిక అంశాల పై అవగాహన వుండాలి. కౌన్సిలర్ /కార్పొరేటర్ అభ్యర్థులకి వార్డు డివిజన్ సరిహద్దులు తెలిసివుండాలి. ప్రభుత్వ భూమిరక్షణ వినియోగం పబ్లిక్ పార్కు వినియోగం విస్తరణ వీక్లీ సంత మార్కెటింగ్ 'స్టోరేజ్ సౌకర్యాలు 'ఉత్పత్తి ఉత్పాదకత చిన్న ' కుటీర లఘు ' పరిశ్రమలు పెట్టుబడి వాటి నిర్వహణ పనితీరు ఉపాధి సృష్టి ఆదాయ సృష్టి 'అటవీ సంరక్షణ 'పర్యావరణ ప్రకృతి విపత్తుల చట్టాల పట్ల అవగాహన పరిజ్ఞానం ఉండాలి.

**సంక్షేమ చట్టాల పట్ల అవగాహన**

మహిళా ' యువజన' ఎస్సి ఎస్టీ 'బిసి సాధికారిత సంక్షేమం అభివృద్ధి పథకాలు చట్టాల పట్ల అవఘానుండాలి నిర్ణిత కాలములో వారినిఅమలు చేసే సత్తా ఉండాలి..విద్యుత్ శక్తి తాగునీటివనరుల ప్రాజెక్ట్ నిర్మాణం నాణ్యత పట్ల అవగాహన పరిజ్ఞానం కలిగిన అభ్యర్థికి ఓటర్లు తమ ఓటు హక్కుతో మద్దతు ప్రకటించాలి.

**వార్డు/ డివిజన్ భివృద్ధిపై విజన్ ఉండాలి**

కౌన్సిలర్గా/ కార్పొరేటర్ గా పోటీ చేసే అభ్యర్థికి వార్డు డివిజన్ అభివృద్ధిపై స్పష్టమైన విజన్ ఉండాలి.
వార్డు/ డివిజన్ లోని ప్రజల జీవన విధానం విధ్య' వైద్య రావణా 'కరంట్ ' డ్రైనేజ్ మౌలిక వసతుల కల్పనకు సామాజిక అవస్థాపన పెట్టుబడులు 'మూలధన వనరుల సమీకరణ వనరుల అభిలషణీయ వినియోగం పట్లనిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికలతో అభివృద్ధి సంక్షేమానికి పెద్ద పీట వేసిన విశ్వసనీయ అభ్యర్థులకు విజ్ఞత గల ఓటర్లు ఓటు వెయ్యాలి.

**చట్టాలపై అవగాహన ఉండాలి**

కౌన్సిలర్ /కార్పొరేటర్ గా పోటీ చేసే అభ్యర్థికి రాజ్యాంగం పట్ల అవగాహన స్థానిక సంస్థల చట్టాల మీద పరిజ్ఞానం కలిగిన అభ్యర్థికి ఓటు వెయ్యాలి. కేంద్ర ప్రభుత్వం నుండి ఫైనాన్స్ కమిషన్ నుండి నిధులను తీసుకు వచ్చే అధికారులతో ఉత్తమ సంబంధాలు పరిజ్ఞానం ఉండాలి.అర్బన్ డెవలప్మెంట్ చట్టాలు రెవెన్యూ చట్టాలు అటవీ చట్టాలు పారిశ్రామిక చట్టాలు మహిళా యువత ఎస్సి' ఎస్టీ 'బీసీ మైనార్టీలు హక్కుల రక్షణ భద్రత సంక్షేమ పథకాలు ప్రాజెక్టుల అమలు కొరకు వున్న చట్టాల పట్ల అభ్యర్థులు అవగాహన పరిజ్ఞానం కలిగి వుండాలి.వార్డు/ డివిజన్/ప్రగతి సమీక్ష సమావేశాలు నిర్వహించాలి.

**మేనిఫెస్టో అమలు సమీక్ష సమావేశాలు నిర్వహించాలి**

ఎన్నికైన కౌన్సిలర్ /కార్పొరేటర్ / ప్రతి 3 నెలలకు ఒక సారి వార్డు /డివిజన్/పట్టణ సభ విధిగా నిర్వహించాలి. ఎన్నికల మేనిఫెస్టో లో పేర్కొన్న అంశాల అమలు పట్ల సమీక్ష సమావేశాలు నిర్వహించి ప్రగతి సంక్షేమ పథకాల అమలులో ప్రజలను భాగస్వాములను చెయ్యాలి.
వార్డు /డివిజన్లో లోని ప్రజలు ప్రభుత్వానికి చెల్లించే పన్నులు వార్డు /డివిజన్అభివృద్ధికి కేంద్ర 'రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులు వాటి వినియోగం మీధ ఓటర్లతో సమావేశాలు నిర్వహించాలి.

**ప్రజల వద్దకు పాలనను అందించాలి**

ఎన్నికైన కౌన్సిలర్/ కార్పొరేటర్ లు వార్డు/ డివిజన్ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలి.
ప్రజల పిర్యాదులను సమస్యలను సంబంధిత ప్రభుత్వ విభాగాల ద్వారా వారం రోజుల్లో పరిష్కారమయ్యే పాలన విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలి.
ప్రతి 3 నెలలకు ఒక సారి జిల్లా స్థాయి వివిధ విభాగాల అధికారులు వార్డు/డివిజన్ పరిధిలో ఎన్నికైన ఎమ్మెల్యేలు ఎంపీల సమావేశాన్ని నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలి. వార్డు /డివిజన్ ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి అసెంబ్లీకి పార్లమెంట్కు వెళ్ల లేరు. ఎమ్మెల్యేలు ఎంపీలు హాజరైతే ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై వారికి అవగాహన ఏర్పడుతుంది ప్రజలకు ప్రజాప్రతినిధులకు మధ్యన సంబంధాలు బలోపేతం అవుతాయి.
మునిసిపాలిటీ సిబ్బందిలో అధికారులలోజవాబుదారీతనం
పారదర్శనికతకు సుపరిపాలనకు చర్యలు చేపట్టాలి.
ప్రజల వద్దకు పాలనను చేర్చే చర్యలు చేపట్టాలి.ఓటర్ల అప్రమత్తతే ప్రజాస్వామ్యానికి రక్ష
రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవలిసిన బాధ్యత ఓటర్ల పై వుంది. ఓటర్లు అప్రమత్తంగా వుండి అర్హులైన అభ్యర్థులను కౌన్సిలర్ గా/ కార్పోరేటర్ గా ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి. అభ్యర్థుల హామీలను పరిశీలించి వారి పని తీరును పరిశీలించాలి.
వార్డు/డివిజన్ /పట్టణం భవిష్యత్తు విజ్ఞత గల ఓటర్ల చేతుల్లోనే ఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం లేదు. డ్రగ్స్ 'అవినీతి భూ మాఫీయా ' ఇసుక మాఫియా ' పేదరికం నిరుద్యోగం సామాజిక' ఆర్థిక అసమానతలు 'లింగ వివక్ష లైంగిక వేదింపులు 'సామాజిక హింస బాలకార్మికులు నిర్మూలన వెట్టిచాకిరి యువత విద్యార్థుల ఆత్మహత్యలు మొన్నగు సమస్యలను తుడిచి పెట్టే సామర్థ్యం వున్న విద్యావంతులు
నిజాయితీ గల అభ్యర్తులను కౌన్సిలర్గా/ కార్పొరేటర్స్ గా ఓటర్లు ఎన్నుకోవాలి.

**ప్రగతిశీలబి వార్డు /డివిజన్ బిఓటర్ల ప్రతిజ్ఞ**

వార్డు/ డివిజన్ /(పట్టణాన్ని) ప్రగతి శీలంగా ప్రజాస్వామ్య పద్ధతిలో అభివృద్ధి చేసే అభ్యర్థిని కౌన్సిలర్/ కార్పొరేటర్ గాఎన్నుకుంటామని ఓటర్లుగా ప్రతిజ్ఞ చేద్దాం. సకల జనుల సంక్షేమానికి వార్డు /డివిజన్ /పట్టణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు ఓటేద్దాం. ఓటుతో ప్రజలజీవితాల్లో వెలుగులు తెద్దాం.

**నేదునూరి కనకయ్య**
**రాష్ట్ర అధ్యక్షులు**
**తెలంగాణ ఎకనామిక్ ఫోరం**
**కరీంనగర్**
**9440245771**



# కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మరోసారి అన్యాయం జరిగిందని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ విమర్శించారు. ఆయన మాట్లాడుతూ, "ఎప్పటిలాగే విద్య పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ఈ బడ్జెట్‌లో కూడా స్పష్టంగా కనిపిస్తోంది. అంతర్జాతీయంగా భారత్ నాలుగో ఆర్థిక శక్తిగా ఎదిగిందని చెప్పుకుంటున్న మోడీ ప్రభుత్వం గత 12 ఏళ్ల పాలనలో విద్యారంగానికి తగిన నిధులు కేటాయించడం లేదు" అని అన్నారు. ఈ సంవత్సరం ?53.5 లక్షల కోట్ల మొత్తం బడ్జెట్‌లో



విద్యకు కేటాయించిన నిధులు కేవలం 1,39,289 కోట్లు మాత్రమేనని, ఇది మొత్తం బడ్జెట్‌లో 2.6 శాతం మాత్రమేనని వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో 50.65 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యకు 1,28,650 కోట్లు కేటాయించగా, ఈసారి అంకెల్లో పెరుగుదల కనిపించినప్పటికీ, మొత్తం బడ్జెట్‌లో ప్రగతిశీల పెరుగుదల లేదని పేర్కొన్నారు. కొఠారి కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీసం 6% బడ్జెట్ కేటాయింపులు లేకుండా ఆర్థిక మంత్రి ప్రసంగాలు ఎంత చేసినా, పేద మరియు మధ్యతరగతి ప్రజలకు విద్య అందని ద్రాక్షగానే మిగులుతుందని ఆయన విమర్శించారు. విద్యకు కనీసం 6% కేటాయింపులు చేసినప్పుడే భారత్ అన్నిరంగాలలో వికసిస్తుందని స్పష్టం చేశారు.

# ప్రజల సంక్షేమ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

### కడ్తాల్ సర్పంచ్ - రాయికంటి బిక్షపతి

**కడ్తాల్, ఫిబ్రవరి 1 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడం, శాశ్వత మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా కడ్తాల్ పట్టణంలో 10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, నాయకులు. కడ్తాల్ పట్టణ కేంద్రంలోని ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా కేటాయించబడిన 10 లక్షల నిధుల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ సర్పంచ్ రాయికంటి బిక్షపతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి ,డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి గార్లు స్థానిక అధికారులు, నాయకులు మరియు ప్రజలతో కలిసి కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో మరియు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రాష్ట్ర ప్రజా ప్రభుత్వం కడ్తాల్ మండల కేంద్రానికి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా కేటాయించబడిన 10



లక్షలతో సిసి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టామని అన్నారు. కడ్తాల్ పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ఆ దిశగా మా నాయకులతో కలిసి తాను శాయశక్తుల కృషి చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో తెలంగాణ అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా దూసుకెళ్తుందని అన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి పాలనలో గ్రామాలకు, పట్టణాలకు మహర్దశ వచ్చిందన్నారు. గత ప్రభుత్వ పాలకుల చేతుల్లో నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురైన అనేక గ్రామాలు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో క్రమక్రమంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా మారిందన్నారు. అదేవిధంగా అన్ని గ్రామాలలో మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని జరుగుతుందని, అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈరెడ్డి యాదగిరి రెడ్డి, వార్డు సభ్యులు మల్లయ్య, జాంగిర్ బాబా, కర్రోళ్ల రమేష్, ఎర్రోళ్ల రాఘవేందర్, చేగురి మహేష్, భానుకిరణ్, కొప్పు కృష్ణ, దుడ్డు నాగరాజు, మంకీ మహేష్, ముత్తి కృష్ణ మరియు సేవాదళ్ మండల అధ్యక్షులు లక్ష్మయ్య, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, నాయకులు సత్యం యాదవ్, జహంగీర్ అలీ, చెందోజి, వడ్డే రాజు, రాయికంటి శ్రీను, రాములు, చెన్నయ్య, ఎర్రోళ్ల శ్రీకాంత్, ఇమ్రాన్ బాబా, రాజేందర్ గౌడ్, రమేష్, మల్లేష్, శ్రీకాంత్, మహేష్, రవి, లక్ష్మణ్, నరేష్, సత్తయ్య, జంగయ్య, శ్రీశైలం మరియు తదితరులు పాల్గొన్నారు.

# కడ్తాల్ లో బిఆర్ ఎస్ నిరసన





### -పాల్గొన్న కడ్తాల్ మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరథ్ నాయక్


**కడ్తాల్, ఫిబ్రవరి 1 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :** కడ్తాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ అధినేత,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారిపై కాంగ్రెస్ సర్కార్ రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు మేరకు కడ్తాల్ బి అర్ యస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా కడ్తాల్ మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్ పాల్గొన్నారు. లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరథ్ నాయక్ మాట్లాడుతూ కేసీఆర్ ని ముట్టుకుంటే రాష్ట్రం అగ్ని గుండంలా మారుతుందని కాంగ్రెస్ ప్రభుత్వాని కి పాలన చేతగాక పోతే దిగిపోవాలని,ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక, ప్రజల దృష్టి మళ్లించడానికి కేసీఆర్ గారిపై రాజకీయవేధింపులకుపాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలే భూస్థాపితం చేస్తారని. కేసీఆర్ జోలికి వస్తే రేవంత్ రెడ్డిని, ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలే బొంద పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని అలాగే తెలంగాణ సమాజం కూడా సిద్ధంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ డైరెక్టర్ వీరయ్య, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, సర్పంచులు ప్రియా రమేష్, శీను నాయక్,రామ్ చంద్ నాయక్,చిట్టి రమేష్ నాయక్, మాజీ సర్పంచులు రవీందర్ రెడ్డి, యాదయ్య,సులోచన సాయిలు, మాజీ ఎంపిటిసిలు మంజుల చంద్రమౌళి,రంగయ్య,ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ,నాయకులు రమేష్, నరసింహ, మహేష్, వెంకటేష్, శ్రీను, గోపాల్,పాండు, కోటియా,వెంకటేష్, దాసు సంతోష్, ప్రవీణ్,నరేష్,శ్రీకాంత్, సురేష్, అంజి, శ్రీకాంత్, ముత్యాలు, మహేష్ రవి గోపాల్,చందు,జగన్,శీను,సరియా, వెంకటేష్ ,నాగార్జున్, మోబిన్, బిఆర్ఎస్ మండల పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, బిఆర్ఎస్ నాయకులు, యువత, సోషల్ మీడియా వారియర్స్, కార్యకర్తలు అభిమానులు తదితరులు ఉన్నారు.

# గంగమ్మ జాతరకు సెలవు ప్రకటించాలని డిమాండ్




**వేములపల్లి, ఫిబ్రవరి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వేములపల్లి మండల బిజెపి అధ్యక్షుడు పెదమాం భరత్ మాట్లాడుతూ జిల్లాలోనే అతిపెద్ద గంగమ్మ తల్లి జాతర సందర్భంగా ప్రభుత్వం మండల వ్యాప్తంగా సెలవు ప్రకటించాలని కోరారు. బుగ్గబాయి గూడెం గ్రామంలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి భక్తిశ్రద్ధలతో జరిగే ఈ జాతరకు గుర్తింపు ఇవ్వాలని, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

# వల్లపుదాసు వెంకటేష్ గౌడ్ కుటుంబానికి కడ్తాల్ మాజీ సర్పంచ్ భరోసా



**కడ్తాల్, ఫిబ్రవరి 1 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: కడ్తాల మండలం, చరికొండ గ్రామానికి చెందిన వల్లపుదాసు వెంకటేష్ గౌడ్ కొద్దీ రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం చరికొండలో ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమానికి కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మ రెడ్డి హాజరయ్యారు. స్థానిక బీఆర్ఎస్ నేతలతో కలిసి చరికొండ గ్రామంలో వెంకటేష్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, మృతుడి కుటుంబానికి 5,000/- ఆర్థిక సహాయం అందజేశారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని,అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు తావివ్వకుండా ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ ఉంటామని,సమాజ శ్రేయస్సే తమ ధ్యేయమని, మండల పరిధిలో ఎవరికి ఏ ఆపద వచ్చినా మేమున్నామని బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్రిపల్లి మాజీ సర్పంచ్ ,భారతమ్మనర్సింహ్మ,బాగ్యమ్మజంగయ్య,బీఆర్ఎస్ నాయకులు లాలికోట జంగయ్య,భీష్మా చారి,మూడ అశోక్ కుమార్, సాబెర్ బాయ్,వార్డు సభ్యులు వెంకటయ్య గౌడ్,జల్ల రాములు, నర్సింహ్మ,సాప మహేష్, సాప వెంకటయ్య, గ్రామస్థులు పెద్దలు తదితరులు ఉన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు పేరు తో ప్రతిపక్షాన్ని భయపెట్టే ప్రయత్నం



**దేవరకొండ ఫిబ్రవరి 01. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా డిండి మండలం కేంద్రంలో,బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు అనంతరం సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. తెలంగాణ సాధకుడు, ఉద్యమ నాయకుడు, ప్రధాన ప్రతిపక్ష నేత,తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పై ఫోన్ ట్యాపింగ్ అనే పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, రాజ్యాంగ విలువలను కాలరాస్తూ దుర్మార్గపు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న అరాచక,నియంతృత్వ చర్యలకు వ్యతిరేకంగా,కేసీఆర్‌ను సిట్ విచారణ పేరుతో రాజకీయ వేధింపులకు గురిచేస్తున్న నేపథ్యంలో రేవంత్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో అధ్యక్షులు రాజినేని వెంకటేశ్వర రావు, రాఘవాచారి, గిరమోని శ్రీనివాస్ మర్రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, బలముల తిరుపతయ్య, రవీందర్ రావు, గొడుగు వెంకటయ్య, సర్య నాయక్, వెంకట్రామ్ రామావత్, తండు వెంకటయ్య గౌడ్, ఎండీ రషీద్, గుర్రం సురేష్, ఎండీ బాసీత్, గొడుగు శ్రీశైలం, సీమర్ల మల్లయ్య,పీర్ మహమ్మద్, పాలే సూరి, కటికర్ల రామ లక్ష్మయ్య, బలమూరి రామ లక్ష్మయ్య, బుష్పాక రామస్వామి, అంకల్,మాజీ ఎంపీటీసీ లు, మాజీ సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ ను విమర్శించడం అప్రజాస్వామ్యకం

-రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**ఆమనగల్లు, ఫిబ్రవరి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఫోన్ టాపింగ్ కేసులో విచారణ పేరుతో మాజీ సీఎం కేసీఆర్ ను వేధించడం అ ప్రజాస్వామికమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం సాధించిన నాయకుడిపై రాజకీయ కక్షతో చర్యలకు పాల్పడడం రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పక్కకు పెట్టి ప్రతిపక్షాలను ఉపయోగించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కు నోటీసులపై బీఆర్ఎస్ నిరసన



**ఆమనగల్లు, ఫిబ్రవరి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** అబద్ధపు హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తప్పించుకోవాలనే మళ్లీ డైవర్షన్ గేమ్స్ ఆడుతూ తెలంగాణ జాతిపిత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి ఫోన్ ట్యాపింగ్ అక్రమ కేసులో నోటీసులు ఇచ్చి విచారణకు పిలవడంపై నిరసన తెలుపుతూ జాతీయ రహదారిపై సీ ఎం దిష్టి బొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు పొనుగోటి అర్జున్ రావు, మాజీ ఎంపీటీసీ కుమార్, మండల జనరల్ సెక్రెటరీ గండికోట శంకర్, ఉపాధ్యక్షుడు దొడ్డి పరమేష్, ఉపసర్పంచి కుమార్, ప్రశాంత్, రైసల్, శేఖర్,లక్ష్మణ్, జంగయ్య, రూప్ సింగ్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్పంచ్ చేతులమీదుగా నీలగిరి ఎక్స్‌ప్రెస్ వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ



**ఎలిగేడు, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని నారాయణపల్లి గ్రామ సర్పంచ్ రంగు లత శ్రీనివాస్ చేతులమీదుగా ఆదివారం వారి గృహంలో నీలగిరి ఎక్స్‌ప్రెస్ వార్షిక దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "కొద్ది కాలంలోనే ప్రజల మన్ననలను పొందిన పత్రికగా నీలగిరి ఎక్స్‌ప్రెస్ నిలిచింది. ప్రజలకు అర్థమయ్యే రీతిలో వార్తలు అందించడం విశేషం. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొత్తిరెడ్డి బాపురెడ్డి, వార్డు సభ్యులు చింత రెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఎలిగేడు సింగిల్ విండో మాజీ డైరెక్టర్ రంగు శ్రీనివాస్, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

# వైభవంగా మాఘ పౌర్ణమి ఉత్సవాలు



**ఎలిగేడు, ఫిబ్రవరి 1 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** మాఘ పౌర్ణమి పురస్కరించుకొని మండల కేంద్రంలోని పురాతన కోదండ రామాలయం లో ఆదివారం ఆలయ కమిటీ మరియు రాధా చైతన్య ఆశ్రమం సంయుక్త ఆధ్వర్యంలో మాఘ పౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ పారువెల్ల పణిశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, కలశస్థాపన, చండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ స్వీకరించడం. ఈ కార్యక్రమంలో ఎలిగేడు గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఎలిగేడు ప్రభుత్వ పాఠశాల మాజీ పేరెంట్స్ కమిటీ చైర్మన్ అడ్డగుంట తిరుపతి గౌడ్ భక్తులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పై సిట్ అధికారుల దర్యాప్తు ప్రభుత్వ దివాలకోరు తనానికి నిదర్శనం

-బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.



**దేవరకొండ ఫిబ్రవరి 01. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** రాజకీయ కక్షతోనే బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ పై తప్పుడు కేసులు బనాయించి,రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.ఆదివారం తెలంగాణ జాతి పిత, కోట్లాదిమంది ప్రజల ఆరాధ్యుడు కేసీఆర్ పై రాజకీయ కక్షతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలకు నిరసనగా దేవరకొండ పట్టణంలోని బస్ స్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో ప్రతిపక్షాన్ని భయపెట్టే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు అవమానం అని అభిప్రాయపడ్డారు.కేసీఆర్ పై సిట్ అధికారుల దర్యాప్తు ప్రభుత్వ దివాలకోరు తనానికి నిదర్శనం అని ఆయన అన్నారు.కేసీఆర్ ను ఎదుర్కోలేక కాంగ్రెస్ బీజేపీ తోడు దొంగల్లా ఒక్కటై పనికి మాలిన చెత్త ఆరోపణలు చేస్తున్నారు.కెసిఆర్ పై లేని కేసును సృష్టించి ఈ ప్రభుత్వం తమ పబ్బం గడుపు కుంటున్నారు అని ఆయన తెలిపారు.రేవంత్ రెడ్డి బావమరిది సుజన్ రెడ్డి బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే, ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ఈ డైవర్షన్ పాలిటిక్స్ అని అన్నారు.ప్రజల తరపున గట్టిగా మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని, మాజీ మంత్రి హరీష్ రావు ని, మాజీ రాజ్యసభ సభ్యులు సంతోష్ ని ఎదుర్కోలేక,
ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పై అక్రమ కేసులతో దాడి చేయడం ఈ ప్రభుత్వ భయానికి నిదర్శనం అని, చట్టం, న్యాయవ్యవస్థలపై మాకు పూర్తి గౌరవం ఉందన్నారు.మంత్రులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ నీతిమాలిన పనులకు పాల్పడుతున్నారు.ఇది స్కీముల ప్రభుత్వం కాదు, స్కాముల ప్రభత్వం.. ప్రజలు ఎప్పుడో గమనించారు అని,మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గట్టి బుద్ధి చెబుతారు అని ఆయన అన్నారు.కేసీఆర్ పై సిట్ అధికారులు అత్యుత్సాహం చూపిస్తున్నారు అని ఆయన అన్నారు.మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మా నాయకులపై లేని కేసులు పెట్టి డైవర్ట్ చేయడానికి ప్రయత్నిస్తుంది ఈ ప్రభుత్వం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల ఇంచార్జీ పాల్వాయి స్రవంతి, నేనావత్ కిషన్ నాయక్, కేతావత్ బిల్యా నాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు టివిఎన్ రెడ్డి, చింతపల్లి సుభాష్,గాజుల ఆంజనేయులు, నీల రవికుమార్,జర్పుల లోక్య నాయక్,బోయపల్లి శ్రీనివాస్ గౌడ్,వేముల రాజు, బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి ఆన్‌లైన్‌లోనే యూరియా బుకింగ్ కొనుగోళ్లు


- ఇప్పటికే 16 జిల్లాల్లో యాప్ విజయవంతం
- రంగారెడ్డి జిల్లాలో అమలుకు సిద్ధం
- ఫర్టిలైజర్ యాప్ గూగుల్ ప్లే స్టోర్ లో అందుబాటు
- బుక్ చేసిన 24 గంటల్లో యూరియా కొనుగోలు
- యూరియా ఎరువుల పంపిణీలో మరింత పారదర్శకత
- ఇక నుండి రైతులు క్యూ లైన్ లో నిలబడాల్సిన అవసరం లేదు.




**ఆమనగల్లు, ఫిబ్రవరి 1(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** రేపటి నుంచి యూరియా ఫర్టిలైజర్‌ను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో బుక్ చేసుకునే విధానాన్ని రంగారెడ్డి జిల్లాలో అమలు చేయనున్నట్లు ఆమనగల్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. రైతులు ఇకపై ఎరువుల దుకాణాల వద్ద క్యూల్లో నిలబడాల్సిన అవసరం లేకుండా, తమ ఇంటి వద్ద నుంచే స్మార్ట్‌ఫోన్ ద్వారా ఫర్టిలైజర్ బుకింగ్ యాప్లో యూరియాను బుక్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..
మండలంలోని అన్ని ఆ ధీకృత రిటైలర్లు మరియు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు వద్ద ఉన్న యూరియా స్టాక్‌ను రైతులు యాప్ ద్వారా రియల్ టైమ్‌లో పరిశీలించవచ్చని తెలిపారు.యూరియా సరఫరాను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించడమే ఈ విధానం ప్రధాన లక్ష్యమని వివరించారు. యూరియా బుకింగ్ యాప్‌పై రైతులకు తగిన సూచనలు ఇవ్వడం జరిగింది. రైతులు ముందుగా గూగుల్ ప్లే స్టోర్ లో ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని రైతులు లేదా పౌరులు తమ మొబైల్ నంబర్‌ను ఉపయోగించి యూరియా బుకింగ్ యాప్‌లో సులభంగా లాగిన్ కావచ్చు.
జిల్లాలోని రిటైలర్ల వారీగా అందుబాటులో ఉన్న యూరియా బ్యాగుల ప్రస్తుత స్టాక్‌ను ఎవరైనా తనిఖీ చేయవచ్చు. యూరియా బుకింగ్‌కు పట్టా భూ యజమానులు, ఆర్ వో ఫ్ ర్ పట్టాదారులు, నాన్ -పట్టా/ ఎన్ డీ స్ రైతులు మరియు కౌలుదారులు మాత్రమే అర్హులు.గుర్తింపు నిర్ధారణ కోసం పట్టా పాస్‌బుక్ తో లింక్ అయిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ పంపబడుతుంది. రిటైలర్లు నివేదించిన రియల్‌టైమ్ స్టాక్ ఆధారంగా రైతులు యూరియా బ్యాగులను బుక్ చేసుకోవచ్చు.బుకింగ్ పూర్తయిన అనంతరం రైతుకు ఒక ప్రత్యేకమైన బుకింగ్ ఐడీ జనరేట్ అవుతుంది.సాగు ట్యాబ్‌లో నమోదు చేసిన భూమి విస్తీర్ణం ఆధారంగానే యూరియా బ్యాగుల సంఖ్య స్వయంచాలకంగా నిర్ణయించబడుతుంది.పంపిణీని సమర్థవంతంగా నిర్వహించేందుకు బుకింగ్‌లు నిర్దిష్ట విరామాల్లో బహుళ విడతలుగా స్పెల్స్ విభజించబడతాయి.మండలంలోని ఏదైనా అధీకృత రిటైలర్ షాపు లేదా పీఏసీఎస్ నుండి బుక్ చేసుకున్న యూరియాను రైతులు కొనుగోలు చేయవచ్చు.కేటాయించిన మొత్తం పరిమాణాన్ని ఒకటి కంటే ఎక్కువ రిటైలర్ల నుండి కూడా పొందవచ్చు. ఒకసారి సాగు విస్తీర్ణం నమోదు చేసిన తర్వాత దానిని మార్చేందుకు వీలు ఉండదు.యూరియా బుకింగ్ కేవలం 24 గంటలపాటు మాత్రమే యాక్టివ్‌గా ఉంటుంది. ఆ వ్యవధిలో కొనుగోలు చేయకపోతే, స్టాక్ ఆటోమేటిక్‌గా సిస్టమ్‌లోకి విడుదల అవుతుంది. రైతులకు ఏదైనా సహాయ సూచనల కొరకు గ్రామస్థాయిలో జిపివోలు, పంచాయతీ సెక్రటరీలు, వ్యవసాయ విస్తరణ అధికారులను వాలంటీర్లుగా నియమించడం జరిగిందని తెలిపారు. రైతులు ఈ ఆన్‌లైన్ విధానాన్ని సద్వినియోగం చేసుకుని సమయాన్ని ఆదా చేసుకోవాలని, ప్రభుత్వ సూచనలను పాటించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ కోరారు.

# సినిమా ఇండస్ట్రీలో మరో విక్రమార్కుడు

-- దేవరకొండ తాటికోల్ ఆకాష్ పట్టుదల



**దేవరకొండ, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నటనపై మక్కువ, కష్టపడే తత్వం ఉంటే ఆకాశమే హద్దు అని నిరూపిస్తున్నాడు యువ ప్రతిభావంతుడు ఆకాష్. నల్లగొండ జిల్లా దేవరకొండ తాటికోల్ గ్రామానికి చెందిన ఆకాష్, ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటున్నాడు. చిన్నప్పటి నుంచే మార్షల్ ఆర్ట్స్‌పై ఆసక్తితో మాస్టర్ శ్రీను వద్ద కరాటేలో శిక్షణ పొందిన ఆకాష్, అక్కడ నేర్చుకున్న మెళకువలతోనే ఈరోజు సినిమా రంగంలో ధైర్యవంతుడైన ఫైటర్‌గా నిలబడ్డాడు.ప్రముఖ హీరో శ్రీరామ్ నటిస్తున్న తాజా చిత్రం మిరాకిల్లో ఆకాష్ తన బహుముఖ ప్రజ్ఞను చాటుకోనున్నాడు. ఈ సినిమాలో నటుడిగానే కాకుండా, ఫైట్ కంపోజర్‌గా కూడా వ్యవహరించడం విశేషం. ఒకే సినిమాలో నటుడిగా, ఫైట్ మాస్టర్‌గా రెండు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు.సినిమా రంగం అంటేనే సవాళ్లతో కూడుకున్నది. ఎన్నో కష్టాలు ఎదురైనా, అవకాశాల కోసం ఎదురుచూడాల్సి వచ్చినా ఆకాష్ ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. డూప్ ఫైటర్‌గా రిస్క్‌తో కూడిన స్టంట్స్ చేస్తూ, విలన్‌గా తనదైన నటనతో మెప్పిస్తూ, ఫైట్ మాస్టర్‌గా యాక్షన్ సీక్వెన్స్‌లను డిజైన్ చేస్తూ విభిన్న పాత్రల్లో రాణిస్తున్నాడు. పట్టువీడని విక్రమార్కుడిలా తన లక్ష్యం వైపు దూసుకుపోతూ, తన గ్రామానికి, తన గురువుకి పేరు తీసుకురావాలనే తపనతో ఆకాష్ చేస్తున్న ఈ ప్రయాణం ఎంతో మంది యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.మున్ముందు ఆకాష్ మరిన్ని పెద్ద ప్రాజెక్టులలో భాగమై, అగ్రస్థాయి ఫైట్ మాస్టర్‌గా ఎదగాలని ఆకాంక్షిద్దాం.

# కేసీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- బైరెడ్డి రాంరెడ్డి


ర్యాలీగా వస్తున్న బి ఆర్ఎస్ నాయకులు.


నిరసన తెలుపుతూ



**ఎలిగేడు, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు జారీ చేసి విచారణకు పిలవడాన్ని నిరసిస్తూ ఎలిగేడు మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. ఎస్‌బీఐ బ్యాంకు నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు నినాదాలతో ర్యాలీ కొనసాగింది. అంబేద్కర్ విగ్రహం ముందు బీఆర్ఎస్ కార్యకర్తలు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, "కేసీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారు" అని అన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ కార్యక్రమంలో సుల్తాన్‌పూర్ సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, బీఆర్ఎస్ ఎలిగేడు మండల మాజీ అధ్యక్షుడు తానిపర్తి మోహన్‌రావు, మాజీ సర్పంచ్ కొండయ్య రాజా, బద్దం తిరుపతిరెడ్డి, బోయిని సత్యం, న్యాతరి పోచాలు, బాసంపల్లి వినోద్, బింగి రాజు, అడ్డగుంట ప్రదీప్ గౌడ్, కవ్వంపల్లి నారాయణ, సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సిట్ నోటీసులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన



**వెల్దండ, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ వెల్దండ మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. శ్రీశైలం--హైదరాబాద్ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించడంతో కొద్దిసేపు వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని రాకపోకలను క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మండల సింగిల్ విండో మాజీ చైర్మన్ జూపల్లి భాస్కరరావు, మాజీ వైస్ ఎంపీపీ వెంకయ్య, వెల్దండ మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు కానుగుల జోగయ్య, మండల యూత్ అధ్యక్షుడు జంగిలి యాదగిరి, సీనియర్ నాయకుడు పోలే అశోక్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవునిపడకల్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆందోళనలు, నిరసన



**తలకొండపల్లి, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి మండల పరిధిలోని దేవునిపడకల్ గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుమ్మరి శంకర్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సిట్ విచారణ పేరుతో జరుగుతున్న కక్ష సాధింపు చర్యలను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు రోడ్డు పై బైఠాయించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి రమేష్, గ్రామ సర్పంచ్ కనుగుల అనిత మల్లేష్, ఉప సర్పంచ్ అంబటి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ కడమోని రవి, మండల నాయకుడు ఓరుగంటి వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు స్వామి గౌడ్, కడమోని రాము, అంబటి లక్ష్మయ్య, కనుగుల మాదవి మల్లేష్, రాజమోని జ్యోతి లక్ష్మయ్య, రాజమోని మంజుల, శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు మద్దూరి సత్యం, జలా జంగయ్య, పద్మ, రామస్వామి, పద్మ ఆంజనేయులు, అంబటి లింగయ్య, పోలేమోని హరికృష్ణ, మద్దూరి యాదయ్య, అంబటి శంకర్ మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్)లో బై--లాస్ ఉల్లంఘనలు, అక్రమ ఎన్నికలు -- న్యాయపరమైన చర్యలు



తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘంలో 2025--2028 కాలానికి నిర్వహించబడిన రాష్ట్ర మరియు జిల్లా స్థాయి ఎన్నికలు సంఘ బై--లాస్‌లకు, అలాగే తెలంగాణ సంఘాల నమోదు చట్టం, 2001 నిబంధనలకు స్పష్టంగా విరుద్ధంగా నిర్వహించబడ్డాయని భావించి, ఆ ఎన్నికల చట్టబద్ధతను సవాల్ చేస్తూ సోనగంటి వేణుగోపాల్ చింతపల్లి మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు న్యాయపరమైన చర్యలు చేపట్టిన విషయాన్ని సంఘ సభ్యులకు, ఉపాధ్యాయ సమాజానికి మరియు ప్రజలకు తెలియజేస్తున్నాను.

ఈ నేపథ్యంలో, పై అక్రమ ఎన్నికలను ప్రశ్నిస్తూ వేణు గోపాల్ ఉపాధ్యాయుడు కేసు నెం. 6/2026 ను గౌరవనీయులైన సిటీ సివిల్ కోర్టు, హైదరాబాద్‌లో దాఖలు చేశారు

ఈ కేసులో నా తరపున అడ్వకేట్ గుర్రం వెంకటరమణ వాదనలు వినిపించగా, ప్రాథమిక వాదనలు పరిశీలించిన అనంతరం గౌరవనీయ న్యాయస్థానం ప్రతివాదులకు నోటీసులు జారీ చేసి, కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

ప్రతివాదులు:

1. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తరపున -- ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు వి. రాజశేఖర్
2. తపస్ -- ప్రస్తుత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలకలపల్లి పెంటయ్య
3. ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన మరియు ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన వ్యక్తులు:

పాలేటి వెంకట్రావు
నరేందర్ రావు
కానుగంటి హనుమంతరావు
సూరం విష్ణువర్ధన్ రెడ్డి

పిటిషన్‌లో గౌరవనీయ న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చిన ముఖ్యాంశాలు:

సంఘ బై--లాస్‌లలో నిర్దేశించిన కాల పరిమితిలో ఎన్నికలు నిర్వహించకపోవడం

సంఘ బై--లాస్‌ల ప్రకారం అర్హత లేని వ్యక్తులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించడం

సంఘ బై--లాస్‌ల ప్రకారం ఎన్నికల అధికారులను అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ నియమించాల్సి ఉండగా, ఆ నిబంధనను పూర్తిగా ఉల్లంఘించి, ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన వ్యక్తులే తమకు తామే ఎన్నికల అధికారులుగా నియమించుకొని ఎన్నికలు నిర్వహించడం --- ఇది ప్రజాస్వామ్య సూత్రాలకు మరియు సహజ న్యాయానికి విరుద్ధమైన అప్రజాస్వామిక చర్య

పదవీ విరమణ చేసిన వ్యక్తులైన పాలేటి వెంకట్రావు మరియు నరేందర్ రావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించడం --- సంఘ బై--లాస్‌ల ప్రకారం పూర్తిగా చెల్లని, అక్రమ చర్య

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన రోజున మరియు ఎన్నికలు జరిగిన రోజున అమెరికాలో నివసిస్తూ, భారతదేశంలో భౌతికంగా లేని శ్రీ సూరం విష్ణువర్ధన్ రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించినట్టు చూపించడం --- ఇది ఎన్నికల ప్రక్రియ యొక్క విశ్వసనీయతను పూర్తిగా దెబ్బతీసే, అప్రజాస్వామిక చర్య, ఒకే రోజులో నామినేషన్లు స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ మరియు ఫలితాల ప్రకటన జరపడం ద్వారా స్వేచ్ఛాయుత, న్యాయసమ్మత ఎన్నికల మౌలిక సూత్రాలను ఉల్లంఘించడం

సంఘ బై--లాస్‌లలో లేని "అదనపు ప్రధాన కార్యదర్శి" వంటి పదవులను అక్రమంగా సృష్టించి కొనసాగించడం

సంఘ బై--లాస్‌ల ప్రకారం ఆర్గనైజింగ్ సెక్రటరీ పదవి ఒక సామాజిక కార్యకర్తకు కేటాయించాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా ఒక వర్కింగ్ టీచర్‌కు ఆ పదవిని కేటాయించడం

ఎలక్షన్ నోటిఫికేషన్ జారీ అయిన సమయంలో మరియు ఎన్నికలు జరిగిన రోజున సంఘ అధ్యక్షుడిగా ఉన్న కానుగంటి హనుమంతరావు, స్వయంగా ఎన్నికల అధికారిగా వ్యవహరించి, తనకే తానే "ఆర్గనైజింగ్ సెక్రటరీ" పదవిని కేటాయించుకోవడం --- ఇది సహజ న్యాయ సూత్రాలకు, ప్రజాస్వామ్య విలువలకు మరియు సంఘ బై--లాస్‌లకు విరుద్ధమైన తీవ్రమైన అక్రమ చర్య

సంఘ సభ్యుల హక్కులను హరించడం మరియు సంఘాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగించడం

ఈ న్యాయ చర్యలు ఏ వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని చేపట్టినవి కావని, పూర్తిగా సంఘంలో చట్టబద్ధత, ప్రజాస్వామ్య పరిరక్షణ మరియు ఉపాధ్యాయుల హక్కుల రక్షణ కోసమే చేపట్టబడినవని స్పష్టం చేస్తున్నాను.

గౌరవనీయ న్యాయస్థానంపై నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. చట్ట ప్రకారం న్యాయం తప్పకుండా జరుగుతుందని, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘంలో భవిష్యత్తులో చట్టబద్ధమైన, పారదర్శకమైన మరియు ప్రజాస్వామ్య ఎన్నికలు నిర్వహించబడతాయని నమ్ముతున్నాను.

ఈ న్యాయపోరాటంలో నాకు మద్దతుగా నిలుస్తున్న ఉపాధ్యాయులకు మరియు సంఘ సభ్యులకు నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఇట్టి ఫిర్యాదు విషయమై రాష్ట్రంలోని అందరూ విద్యాధికారులకు సమాచార నిమిత్తం పంపించడం జరుగుతుంది.

సొనగంటి వేణుగోపాల్
సభ్యుడు,
తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం .

## అభ్యర్థులను ప్రకటించిన ఏఐఎఫ్‌బీ



**పెద్దపల్లి, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల్లో సింహం గుర్తు అభ్యర్థులను గెలిపించి మార్పుకు శ్రీకారం చుట్టాలని ఏఐఎఫ్‌బీ పార్టీ చైర్మన్ అభ్యర్థి కొలిపాక శ్రీనివాస్ ప్రజలను కోరారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన 26 మంది కౌన్సిలర్ అభ్యర్థులను ప్రకటించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ప్రజలను మోసం చేస్తున్నాయని, అధికార--ప్రతిపక్షాలు కలిసిపోయి పట్టణ ప్రజల సమస్యలను విస్మరిస్తున్నాయని విమర్శించారు. సుల్తానాబాద్‌లో బీసీ అభ్యర్థిపై అవిశ్వాసం పెట్టి గద్దె దించగా, పెద్దపల్లిలో మాత్రం మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యురాలిపై అవిశ్వాసం పెట్టకపోవడం ప్రజలు గమనించాలని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే నిధులు వస్తాయనుకోవద్దని, కేంద్రం--రాష్ట్రం నుంచి నిధులు నేరుగా మున్సిపాలిటీకి వస్తాయని ప్రజలకు గుర్తు చేశారు. త్వరలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సమక్షంలో భారీ బహిరంగ సభ నిర్వహించి అభివృద్ధి పనులను ప్రకటిస్తామని తెలిపారు. సింహం గుర్తు అభ్యర్థులను గెలిపించి ప్రజల పక్షాన నిలబడే మార్పుకు శ్రీకారం చుట్టాలని ఆయన పట్టణ ప్రజలను కోరారు.

## అవినీతిలో కూరుకుపోయిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

- కాయితి విజయ్‌కుమార్ రెడ్డి



**కల్వకుర్తి, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు కాయితి విజయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అవినీతి, అక్రమాలతో కాలయాపన చేస్తూ, ఎలాంటి అవినీతికి పాల్పడలేదని చెప్పడం కల్లి బోల్లి కబుర్లే. నట్టేట ముంచిన కేసీఆర్ కాగానే సిట్ నోటీసులు అందుకున్నారు" అని ఘాటుగా స్పందించారు. ఆయన పేర్కొంటూ, "కేసీఆర్‌కు తెలియకుండా ఏ పని జరగదు. బీఆర్ఎస్ హయాంలో ఆయన ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ జరిగింది. విచారణకు హాజరై సహకరించకుండా తప్పించుకోవడం విడ్డూరం. అవినీతికి పాల్పడకపోతే విచారణకు హాజరై నిజాయితీ నిరూపించుకోవాలి" అని సూచించారు. "సిట్ అధికారులు విచారణకు పిలిస్తే రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపై దిష్టిబొమ్మలు దహనం చేయడం, నిరసనలు ఆందోళనలు చేయడం ఏమిటి? విచారణలో వాస్తవాలు తేలుతాయి" అని ప్రశ్నించారు. అదేవిధంగా, "ఫోన్ ట్యాపింగ్ వల్ల అనేక రాజకీయ నాయకులు, అధికారులు జీవితాలు నాశనమయ్యాయి" అని కాయితి విజయ్‌కుమార్ రెడ్డి విమర్శించారు.

## జాతీయస్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు మూడోసారి ఎంపికైన స్రవంతి



**వంగూరు, ఫిబ్రవరి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం ఉప్పల్పాడు గ్రామానికి చెందిన ఏ. స్రవంతి మరోసారి జాతీయస్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైంది. పేద కుటుంబానికి చెందిన ఆమె, తాండూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ సీనియర్ మహిళల పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఫిబ్రవరి 6 నుండి 9 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో జరిగే జాతీయ పోటీల్లో ఆమె పాల్గొననుంది. గతంలో మహబూబాబాద్‌లో జరిగిన జూనియర్ పోటీల్లో కాంస్య పతకం సాధించి, ఘజియాబాద్‌లో జరిగిన జాతీయ పోటీల్లో ప్రశంసా పత్రం పొందింది. అలాగే వరంగల్‌లో జరిగిన సీనియర్ పోటీల్లో మహబూబ్‌నగర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి వెండి పతకం సాధించింది. ప్రస్తుతం మహబూబ్‌నగర్ సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న స్రవంతి, ఫిజికల్ డైరెక్టర్ రజిని శిక్షణతో, రాష్ట్ర షూటింగ్ బాల్ ఉపాధ్యక్షుడు బి. గోపాలం ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తోంది. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి చదువులోనూ, క్రీడల్లోనూ రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సంపాదించడం తన లక్ష్యమని ఆమె తెలిపింది. గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజలు స్రవంతిని అభినందించారు.

# బిజినెస్

# బడ్జెట్ ఎఫెక్ట్.. భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్‌లు

భారత స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. బడ్జెట్‌లో కంపెనీల బైబ్యాక్‌పై పన్ను విధించడం, ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్‌ను పెంచడం మార్కెట్లను కుదిపేసింది. ఒక దశలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 2000 పాయింట్లపైగా పతనమైంది. చివరకు సెన్సెక్స్ 1546 పాయింట్లు పతనమై 80,722 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 495 పాయింట్లు నష్టపోయి 24,119 పాయింట్ల వద్ద ముగిసింది. కాగా బడ్జెట్ నేపథ్యంలో ఇవాళ ఆదివారం అయినప్పటికీ స్టాక్ మార్కెట్‌లు పనిచేశాయి. ఇవాళ్టి ట్రేడింగ్ మదుపర్లకు బ్లాక్‌సండేను మిగిల్చింది. బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు ఫ్లాట్‌గా ట్రేడయిన సూచీలు.. ఎస్‌టీటీ ప్రస్తావన తర్వాత నష్టాల్లోకి జారుకున్నాయి. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయి ఉండే సెక్యూరిటీలను కొనుగోలు, అమ్మకాలు చేసేటపుడు వర్తించే పన్ను ఎస్‌టీటీ. దీనిని బడ్జెట్‌లో 0.02 శాతం నుంచి 0.05 శాతానికి పెంచారు. ఇక ఆప్షన్స్ ప్రీమియంపై ఎస్‌టీటీని 0.15 శాతానికి పెంచారు. ఆ బైబ్యాక్స్‌ను మూలధన



లాభాలుగా పరిగణిస్తూ పన్ను విధించారు. అక్రమ వినియోగానికి చెక్‌పెట్టే ఉద్దేశంతో బైబ్యాక్ పన్నుల్లో మార్పును నిర్మలమ్మ ప్రతిపాదించారు. కార్పొరేట్ ప్రమోటర్ల బైబ్యాక్‌లపై 22 శాతం, నాన్ కార్పొరేట్ ప్రమోటర్ల బైబ్యాక్‌పై 30 శాతం పన్నులు విధించారు. ఇది మదుపర్ల సెంటిమెంట్‌ను భారీగా దెబ్బతీసింది. సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్‌ను పెంచుతున్నట్లు ప్రకటించడంతో బ్రోకరేజీ కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ప్రస్తుతం ఉన్న ట్యాక్స్‌ను 0.02 శాతం నుంచి 0.05 శాతానికి పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడంతో 18 శాతం వరకు ఆయా కంపెనీల షేర్లు పతనమయ్యాయి. బీఎస్ఈలో మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీ (వీజశ) షేర్లు 18.08 శాతం పతనమై రూ.2,068కి చేరాయి. గ్రో మాతృ సంస్థ బిలియన్ బ్రెయిన్ గ్యారెజీ వెంచర్స్ షేర్లు 13 శాతం పతనమై రూ.154కి దిగివచ్చాయి. ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ 10.4 శాతం క్షీణించి రూ.296.10కి చేరింది. యాంజెల్ వన్ స్టాక్ కూడా 11.84 శాతం నష్టపోయి 2,237.95, ఆనంద్ రాఠీ అండ్ స్టాక్ బ్రోకర్స్ 8.5 శాతం క్షీణించి రూ.532.15కి చేరాయి. ఆఖరికి బీఎస్ఈ లిమిటెడ్ షేరు విలువ కూడా అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంది. ఎన్ఎస్ఈలో దీని విలువ 15 శాతం కోల్పోయి రూ.2,377కు చేరింది. నిఫ్టీ సూచీలో మ్యాక్స్ హెల్త్‌కేర్, విప్రో, టీసీఎస్, సన్ ఫార్మా, ఇన్ఫోసిస్ షేర్లు లాభాల్లో ముగిశాయి. హిందాల్కో, ఎస్‌బీఐ, ఓఎన్‌జీసీ, అదానీ పోర్ట్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి.

## సావరిన్ గోల్డ్ బాండ్ల ఇన్వెస్టర్లకు బ్యాడ్ న్యూస్!

### ఇకపై వారికే పన్ను మినహాయింపు




కేంద్ర బడ్జెట్ 2026 ఫ్యూచర్స్, ఆప్షన్స్ లో వ్యవహరించే భారతీయ స్టాక్ మార్కెట్ వ్యాపారులను నిరాశపర్చింది. వారితో పాటు సావరిన్ గోల్డ్ బాండ్లకు కొత్త పన్ను నియమాలను కూడా పేర్కొంది. అసలు ఇష్యూకు సభ్యత్వాన్ని పొందని పెట్టుబడిదారులపై పన్ను భారాన్ని పెంచింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026 బడ్జెట్‌లో ప్రకటించిన ప్రతిపాదన ప్రకారం SGBలపై మూలధన లాభాల పన్ను మినహాయింపు అసలు ఇష్యూకు సభ్యత్వాన్ని పొంది, మెచ్యూరిటీ వరకు ఉంచిన పెట్టుబడిదారులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. సావరిన్ గోల్డ్ బాండ్లకు సంబంధించి మూలధన లాభాల పన్ను నుండి మినహాయింపు.. జారీ సమయంలో ఒక వ్యక్తి అటువంటి బాండ్లకు సభ్యత్వాన్ని పొంది, మెచ్యూరిటీ తర్వాత విమోచనం వరకు ఉంచితే అప్పుడు మాత్రమే పన్ను మినహాయింపు ఉంటుందని ఆర్థిక మంత్రి సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ మినహాయింపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీ చేసే అన్ని సావరిన్ గోల్డ్ బాండ్లకు ఒకే విధంగా వర్తిస్తుందని కూడా తెలిపారు. వాస్తవానికి SGBలు ఇష్యూకు సభ్యత్వం పొందిన వ్యక్తులకు 100 శాతం పన్ను రహితంగా ఉండే విధంగా రూపొందించారు. RBI ద్వారా వాటిని రీడీమ్ చేసుకుంటూ ఐదు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు ఉంచబడ్డాయి.

## బడ్జెట్ వేళ భారీగా దిగొస్తున్న బంగారం, వెండి ధరలు

కొన్ని రోజులుగా శరవేగంగా దూసుకెళ్లిన బంగారం, వెండి ధరలు ఇప్పుడు దిగి వస్తున్నాయి. కేంద్ర బడ్జెట్‌వేళ దేశీయ కమొడిటీ మార్కెట్‌లో ఈ రెండు లోహాల ధరలు 9 శాతం మేర క్షీణించాయి. ఇప్పటికే రికార్డు గరిష్ఠాలకు చేరుకున్న బంగారం, వెండి ధరలు.. లాభాల స్వీకరణ కొనసాగుతుండటంతో ఆదివారం దిగివచ్చాయి.మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో ఏప్రిల్ కాంట్రాక్ట్ బంగారం ధర ఆదివారం 9 శాతం పతనం అయ్యింది. 10 గ్రాముల బంగారం ధర ఒక్కరోజులోనే రూ.13,711 క్షీణించి రూ.1,38,634కు చేరింది. అంతకుముందు గురువారం ఒక్కరోజే పసిడి ధర రూ.31,617 (17.2




శాతం) మేర పతనమైంది. దాంతో రూ.1,93,096 నుంచి ఒక్కసారిగా రూ.1,52,345కు చేరింది. వెండి ధరల్లోనూ పతనం కొనసాగుతున్నది. రికార్డు గరిష్ఠాల వద్ద ట్రేడర్‌లు లాభాల స్వీకరణకు దిగుతుండటంతో మార్చి కాంట్రాక్ట్ వెండి ధర ఒక్క రోజులోనే రూ.26,273 (9 శాతం) పతనమై రూ.2,65,652కి చేరింది. శుక్రవారం ఒక్కరోజే వెండి కిలో ధర రూ.1,07,968 క్షీణించి రూ.2,91,925కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితులు, బడ్జెట్‌వేళ మదుపర్ల అప్రమత్తత కారణంగా బంగారం, వెండి ధరలు పతనమవుతున్నాయని అనలిస్టులు చెబుతున్నారు.

---

## ఆసియా కప్ హీరో ఆగయా..
## ఆ ఇద్దరిలో బెంచ్‌పై ఉండేది ఎవరు..?

ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌లో దుమ్మురేపిన భారత జట్టుకు మరో గుడ్‌న్యూస్. సర్జరీ కారణంగా న్యూజిలాండ్ సిరీస్‌కు దూరమైన తిలక్ వర్మ మళ్లీ జట్టుతో కలువబోతున్నాడు. నెలకు పైగా క్రికెట్ ఆడని అతడు వరల్డ్‌కప్ వామప్ మ్యాచ్‌లో ఆడనున్నాడు. ఈ యంగ్‌స్టర్‌కు ఆదివారం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్లియరెన్స్ ఇచ్చింది. దాంతో.. ముంబైలో జట్టుతో కలువనున్న అతడు వామప్ మ్యాచ్‌లో ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. తిలక్ రాకతో టీమిండియా కూర్పు ఆసక్తికరంగా మారనుంది.విజయ్ హజారే ట్రోఫీలో గాయపడిన తిలక్ వర్మకు 'టెస్టిక్యులార్ సర్జరీ' తర్వాత విశ్రాంతి తీసుకున్నాడు. చిన్న ఆపరేషనే అయినప్పటికీ వైద్యుల సూచన మేరకు తిలక్‌ను న్యూజిలాండ్ టీ20 సిరీస్‌లో ఆడించలేదు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకున్న అతడు.. ఫిట్‌నెస్ సాధిండంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దాంతో.. వరల్డ్‌కప్ సన్నద్ధతలో భాగంగా వామప్ మ్యాచ్ ఆడనున్నాడు. అంతకంటే ముందు డీవై పాటిల్ స్టేడియంలో ఫిబ్రవరి 2న ఇండియా ఏ, యూఎస్ ఏ మ్యాచ్‌లో బరిలోకి దిగుతాడు. అనంతరం ఫిబ్రవరి




4న దక్షిణాఫ్రికాతో వామప్ మ్యాచ్‌లోనూ ఈ చిచ్చరపిడుగు ఆడే అవకాశముంది.

**ఇషాన్, శాంసన్.. ఇద్దరిలో ఎవరు?**

న్యూజిలాండ్‌తో ముగిసిన పొట్టి సిరీస్‌లో ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. తిలక్ వర్మ స్థానంలో క్రీజులోకి వచ్చిన ఈ లెఫ్ట్ హ్యాండర్ మెరుపు ఇన్నింగ్స్‌లతో కివీస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. త్రివేండ్రంతో తన విధ్వంసం డోసు పెంచిన ఇషాన్ 42 బంతుల్లోనే శతకంతో రెచ్చిపోయాడు. మరోవైపు ఓపెనర్ సంజూ శాంసన్ 6 పరుగులతో నిరాశపరిచాడు. ఐదు మ్యాచుల్లో సంజూ టాప్ స్కోర్ 24 మాత్రమే.తిలక్ రాకతో ఇషాన్‌ను మూడో స్థానంలో ఆడిస్తారా? శాంసన్‌ను ఓపెనర్‌గా కొనసాగిస్తారా? అనేది ఉత్కంఠ రేపుతోంది. ఒకవేళ తిలక్‌కు మూడో స్థానంలో అవకాశమిస్తే.. సన్నాహక సిరీస్‌లో అర్ధ శతకం(76), సెంచరీతో కదంతొక్కిన ఇషాన్ ను అభిషేక్ శర్మ కు జోడీగా పంపినా పంపొచ్చు. అప్పుడు శాంసన్ బెంచ్‌కే పరిమితమవ్వడం ఖాయం. వరల్డ్‌కప్ స్క్వాడ్‌లోని వాషింగ్టన్ సుందర్ మరికొన్ని రోజుల్లో ఫిట్‌నెస్ టెస్టుకు హాజరవ్వనున్నాడు. భుజం గాయం కారణంగా రియాన్ పరాగ్ సైతం ఈమధ్య మ్యాచ్‌లు ఆడలేదు. పరాగ్ కూడా ఫిట్‌నెస్ నిరూపించుకుని జట్టుతో కలుస్తాడని మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

## వరల్డ్‌కప్ బరిలో స్కాట్లాండ్, ఐర్లాండ్..
## ఆ పన్నెండు జట్లు ఇవే..!

మహిళల టీ20 ప్రపంచకప్ బెర్తులు ఖరారయ్యాయి. క్వాలిఫయర్స్‌లో సత్తా చాటిన స్కాట్లాండ్ మెగా టోర్నీకి అర్హత సాధించింది. సూపర్ సిక్స్ మ్యాచ్‌లో యునైటెడ్ స్టేట్స్(ఖూూా)ను ఓడించి కీలక పాయింట్లు సంపాదించింది. వరల్డ్‌కప్ బరిలోకి దిగనున్న చివరి జట్టుగా స్కాట్లాండ్ నిలిచింది. అంతకుముందు మరో మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌ను మట్టికరిపించిన ఐర్లాండ్ ప్రపంచకప్ బెర్తు కైవసం చేసుకుంది.ఈ ఏడాది జూన్ -- జూలై మధ్య ఇంగ్లండ్, వేల్స్ వేదికగా మహిళల టీ20 ప్రపంచకప్ జరుగనుంది. మొత్తం ఈసారి 12 జట్లు వరల్డ్‌కప్ కోసం పోటీపడనున్నాయి. గత సీజన్‌లో టాప్-5లో నిలిచిన ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, భారత్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ అర్హత



సాధించాయి. ర్యాంకింగ్స్ ఆధారంగా శ్రీలంక, పాకిస్థాన్ బెర్తు పట్టేయగా.. గ్లోబల్ క్వాలిఫయర్స్ ఆధారంగా బంగ్లాదేశ్, ఐర్లాండ్, నమీబియా, స్కాట్లాండ్ టీ20 వరల్డ్‌కప్ బరిలో నిలిచాయి. పురుషుల టీ20 వరల్డ్‌కప్‌లోకి అనూహ్య పరిణామాల మధ్య స్కాట్లాండ్ ఎంట్రీ ఇవ్వగా.. క్వాలిఫయర్స్‌లో యూఎస్ఏను ఓడించిన మహిళల జట్టు బెర్తు పట్టేసింది. డార్సీ కార్టర్ అర్ధశతకంతో మెరవగా ప్రత్యర్థికి 179 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది స్కాంట్లాండ్. అనంతరం బౌలర్లు చెలరేగడంతో యూఎస్ఏ 137కే ఆలౌటయ్యింది. మరో మ్యాచ్‌లో ఐర్లాండ్ స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకుంది. 122 పరుగుల ఛేదనలో థాయ్‌లాండ్‌ను 59 పరుగులకే ఆలౌట్ చేసి వరల్డ్‌కప్ బెర్తు సొంతం చేసుకుంది.

**మహిళల టీ20 ప్రపంచకప్ జట్లు**

ఇంగ్లండ్(ఆతిథ్య దేశం), ఆస్ట్రేలియా, భారత్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఐర్లాండ్, నమీబియా, స్కాట్లాండ్,

# స్పోర్ట్స్

## పాకిస్తాన్‌పై భారత్ ఘన విజయం..

### సెమీస్‌కు చేరిన టీమిండియా




అండర్ 19 వరల్డ్ కప్‌లో భాగంగా ఆదివారం భారత్-పాకిస్తాన్ మధ్య జరిగిన సూపర్ సిక్స్ మ్యాచులో టీమిండియా ఘన విజయం సాధించింది. దీంతో టోర్నీలో సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. పాక్‌పై 58 పరుగుల తేడాతో ఇండియా భారీ విజయాన్ని అందుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 49.5 ఓవర్లలో 252 పరుగులకే ఆలౌటైంది.ఇండియా బ్యాటర్లలో వేదాంత్ త్రివేది 68 పరుగులు (98 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్సర్) చేయగా, వైభవ్ సూర్యవంశీ 30 పరుగులు (22 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సర్)తో రాణించారు. తర్వాత బ్యాటర్లు తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. చివర్లో కనిష్క్ చౌహాన్ మాత్రం చెలరేగిపోయాడు. 29 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 35 పరుగులు చేశాడు. అలాగే ఖిలాన్ పటేల్ కూడా 15 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 21 పరుగులు చేయడంతో ఇండియా గౌరవప్రదమైన 252 పరుగుల స్కోరు చేసింది. తర్వాత 253 పరుగుల స్వల్ప లక్ష్య సాధన కోసం బరిలోకి దిగిన పాకిస్తాన్ చతికిలపడిపోయింది. 46.2 ఓవర్లలో 194 పరుగులకే ఆలౌటైంది. పాక్ బ్యాటర్లలో ఉస్మాన్ ఖాన్ 66 పరుగులు చేయగా, హంజా జహూర్ 42 పరుగులు, ఫర్హాన్ యూసఫ్ 38 పరుగులు చేశారు. కానీ, మిగతా బ్యాటర్లు తక్కువ పరుగులకే ఔటయ్యారు. దీంతో పాక్ స్వల్ప స్కోరుకే ఆలౌటైంది. భారత బౌలర్లు ఖిలాన్ పటేల్, ఆయుష్ మాత్రే తలో మూడు వికెట్లు పడగొట్టగా, హెనిల్ పటేల్, కనిష్క్ చౌహాన్, విహాన్ తలో వికెట్ తీశారు. ఫలితంగా 58 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం దక్కించుకుంది.